ప్రజాశక్తి
శుక్రవారం 25 నవంబర్ 2022
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

అక్రమ నిర్మాణాలకు ఆకాశమే హద్దు!

- ◆అధికారులను బెదిరిస్తూ పబ్బం గడుపుకుంటున్న వైసిపి కార్పొరేటర్
- ◆పుట్టిన రోజు యాడ్‌లకూ అక్రమ కట్టడాల నుంచే నిధుల సమీకరణ
- ◆అడ్డుతగిలే అధికారులపైనా బెదిరింపుల 'బాణం'...
- ◆సొంత పార్టీ నేత వైవి సుబ్బారెడ్డి వారించినా మారని నైజం...



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ నగరంలో పలు వార్డుల్లో అక్రమ కట్టడాల జోరు నానాటికీ పేట్రేగుతోంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ అనధికార నిర్మాణాలకు ఆకాశమే హద్దుగా ఉంటోంది. జివిఎంసి అధికారులకు సమాచారం తెలిసి అటువైపు వెళ్లాలని చూసినా వారిని వారించి నిలిపేయడమే అధికార పార్టీ కార్పొరేటర్ విధానంగా ఉంది. జోన్‌లలో కొన్నిచోట్ల అధికార, సిబ్బంది అడ్డుతగిలినా అధికార పార్టీ అండదండలు, కౌన్సిల్‌లో సదరు కార్పొరేటరే కీలకం కావడం, మెజారిటీ కూడా ఉండడంతో అధికారులపై పెత్తనం చలాయిస్తూ పబ్బం గడుపుకుంటున్నాడు. జివిఎంసి పరిధిలోని పలు జోన్లలో ఇదే పరిస్థితిని వైసిపి కార్పొరేటర్లు, స్థానిక కొంతమంది నాయకుల నుంచీ అధికారులు ఎదుర్కొంటున్నారు. అధికార పార్టీలోనే సదరు కార్పొరేటర్ చేసే ఈ తరహా ఆగడాలు, అక్రమాలతో ఆర్థికంగా ఎదుగుతున్న తీరుతో తీవ్ర అసహనంతో పలువురున్నారన్నది స్పష్టంగా తెలుస్తోంది. అయితే సదరు కార్పొరేటర్ పెద్దలను ప్రసన్నం చేసుకుంటూ తనదైన శైలిలో రుబాబు చలాయిస్తూ అక్రమార్జనే ధ్యేయంగా సాగుతున్నాడు. సదరు కార్పొరేటర్‌కు తాజాగా ఉత్తరాంధ్ర వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి అక్షితలు వేసినా తన పనితనం ఇంతే...అన్నట్టుగా వ్యవహరించడం విశేషం.

ఆయన కను సైగచేస్తే అక్కడొక అక్రమ కట్టడమే!

జివిఎంసి పరిధిలో వైసిపికి చెందిన కొంతమంది నేతల కనుసైగలతో అక్రమ కట్టడాలన్నీ ఆకాశహర్మ్యాలను తాకుతున్నాయి. పట్టణ ప్రణాళికా విభాగాన్ని పనిచేయించనివ్వకుండా ఈ తరహా కార్పొరేటర్లు కొంతమంది తమ పబ్బం గడుపుకోవడంతో జివిఎంసి ఆదాయానికి తీవ్రంగా గండిపడుతోంది. తాజాగా 44వ వార్డు శ్రీనివాస్‌నగర్‌లో ఇదే చోటుచేసుకుంది. ఈ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు యధేచ్ఛగా సాగుతున్నాయి. జివిఎంసి టౌన్ ప్లానింగ్ నుంచి ఎలాంటి అనుమతులూ ఇక్కడ లేవు. కార్పొరేషన్‌లో తిరుగులేని ఒక కార్పొరేటర్ విసిరిన 'బాణం'తో ఇదంతా సాగిపోతుంది. తాజాగా పార్టీ నాయకుడు వైసిపి రీజనల్

మిగతా 2లో..

ఓటు నమోదుకు విస్తృత ప్రచారం

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా

ప్రజాశక్తి-విశాఖపట్నం : 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు విస్తృత ప్రచారం చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో 'ఓటరు జాబితా ప్రత్యేక సవరణ-2023' పై కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునతో పాటు ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలతో ముఖేష్‌కుమార్ మీనా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రధానాధికారి మాట్లాడుతూ, జిల్లాలో ఎలక్టోరల్ పాపులేషన్ (ఈపీ) నిష్పత్తి తక్కువగా ఉందని, దీన్ని పెంచేందుకు పోలింగ్ స్టేషన్ల వారీగా సమీక్షించాలన్నారు. రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు (బిఎల్‌ఎ)లను నియమించాలని, మండలస్థాయిలో బిఎల్‌ఒ, బిఎల్‌ఎలతో సమన్వయ సమావేశాలు నిర్వహించడం ద్వారా ఓటర్ల జాబితాల రూపకల్పనలో మెరుగైన ఫలితాలు ఉంటాయని చెప్పారు. ఓటరు తొలగింపు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓటరు కుటుంబ సభ్యుల్లో ఒకరి నుంచి ఫామ్-7 పై సంతకం తీసుకున్న తర్వాతనే తొలగించాలన్నారు. వలస వెళ్లిన వారి పేరును ఏదైనా సర్టిఫికెట్? ఆధారంగానే తొలగించాలన్నారు. 18-19 ఏండ్లు నిండిన వారిని గుర్తించి కొత్త ఓటరు ఎన్‌రోల్‌మెంట్ కోసం ఆయా కాలేజీల్లో ఒక పర్సన్‌ను నియమించి ఓటుహక్కు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పట్టణాల్లో మెప్మా గ్రూపులు, వార్డు ఆఫీసర్లను కో-ఆర్డినేషన్ చేస్తూ కొత్త ఓటర్ల నమోదుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నేపథ్యంలో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు బిఎల్‌ఒలకు మార్గదర్శకంగా ఉంటూ పురోగతిని సమీక్షించాలని సూచించారు. విభిన్న ప్రతిభావంతులు , ట్రాన్సజండర్స్ , నిరాశ్రయులను గుర్తించి ఎన్‌రోల్ చేయాలన్నారు. జనవరి నెలలో తుది జాబితాను ప్రచురించనున్న నేపథ్యంలో దరఖాస్తుల స్వీకరణ, పరిష్కారం, ప్రచురణ ఈ మూడు దశల్లోనూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాపై సమీక్షిస్తూ ఓటరు నమోదు కోసం వచ్చిన ఫామ్స్‌ను ఎలా పరిశీలిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తునూ క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు.

జిల్లా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ దోషరహిత జాబితా రూపకల్పనకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్ పాల్గొన్నారు.

26, 27 తేదీల్లో జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ మహాసభలు

▶ వార్త 2లో..

అమరావతే ఏకైక రాజధానిగా ఉండాలి : గిడుగు రుద్రరాజు

▶ వార్త మెయిన్‌లో..

హైర్ బస్ డ్రైవర్లకు కనీస వేతనం అమలు చేయాలి : సిఐటియు

▶ వార్త 8లో..

వేమూరు బలరామ్‌కు లోక్‌నాయక్ ఫౌండేషన్ సాహిత్య పురస్కారం

యార్లగడ్డ లక్ష్మీప్రసాద్



మీడియాతో మాట్లాడుతున్న యార్లగడ్డ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : వివిధ రంగాలలో ప్రముఖులు చేసిన కృషిని ఆధారంగా లోక్ నాయక్ ఫౌండేషన్ అందిస్తున్న సాహిత్య పురస్కారాన్ని ఈ ఏడాదికి స్వాతి వార పత్రిక సంపాదకులు వేమూరు బలరామ్‌కు అందించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ పద్మశ్రీ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ తెలిపారు. గురువారం ఉదయం ఆంధ్ర యూనివర్సిటీ లోని హిందీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సిలికాన్ ఆంధ్ర యూనివర్సిటీ చైర్మన్ డాక్టర్ కూచిపట్ల ఆనంద్, విజయవాడ కెఎల్ యూనివర్సిటీ చైర్మన్ డాక్టర్ కోనేరు సత్యనారాయణ, రాజమండ్రి జిఎస్‌ఎల్ మెడికల్ ఆసుపత్రి కళాశాల స్థాపకులు డాక్టర్ గండి భాస్కరరావు, సినీ నటులు జయప్రద, జయసుధలకు జీవిత సాఫల్య పురస్కారం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పురస్కారం క్రింద రూ.లక్ష అందజేయనున్నట్లు తెలిపారు. 2023 జనవరి 18న ఎన్‌టిఆర్ శత జయంతిని విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఏరినాలో నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి లావు నాగేశ్వరరావు, దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు హాజరవుతారని చెప్పారు. ఈ సమావేశంలో లోక్ నాయక్ ఫౌండేషన్ ట్రస్ట్ కార్యదర్శి బాబయ్య, యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ కుమారుడు శివప్రసాద్ పాల్గొన్నారు.

విస్సన్నపేట భూములపై విచారణ జరిపించాలి

కలెక్టర్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా కశింకోట మండలం విసన్నపేటలో జరిగిన భూ ఆక్రమణలు, జిల్లాలో అనేక ప్రాంతాల్లో అనుమతులు లేకుండా చేస్తున్న గ్రావెల్ తవ్వకాలపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం గురువారం కలెక్టర్‌కు వినతిపత్ర పంపించారు. ఆ వినతిలో పేర్కొన్న వివరాలిలావున్నాయి... "కశింకోట మండలం బయ్యవరం రెవెన్యు పరిధిలోని విస్సన్నపేట పరిసర ప్రాంతాల్లో సుమారు 600 ఎకరాల డి పట్టా, అసైన్డ్ భూములను రైతుల నుంచి బలవంతంగా కొనుగోలు చేసినట్లు, భూ ఆక్రమణలు జరిగాయని పత్రికల్లో వరస కథనాలు వచ్చాయి. ఈ భూ కుంభకోణాలకు సంబంధించి పత్రికల్లో, ప్రచార సాధనాల్లో వచ్చిన వార్తలు చూసి లోకయుక్తా సుమోటోగా తీసుకుంది. అధికారులు ఈ వ్యవహారంపై విచారణ జరిపి అక్రమాలు గుర్తించి ఇటీవల ఆయా భూముల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేశారు. అయితే ఆక్రమణదారులు ఆ బోర్డులను తొలగించి, వాటిపై రాయించిన ఆక్రమణ వివరాలను చెరిపేసి బోర్డులను ఆక్రమిత ప్రాంతాల్లో కాకుండా వేరేచోట పాతారు. గతంలో ఈ ప్రాంతంలో మౌంట్ విల్లాల పేరుతో బ్రోచర్లు వేసి విడుదల చేశారు. నేడు ఈ విల్లాలకు వెళ్లే మార్గం చిన్నదిగా ఉండడంతో రియల్‌ఎస్టేట్ వ్యాపారాలకు ఇబ్బందిగా ఉంటుందని ఆ భూములకు ఆనుకొని ఉన్న అల్లిమెట్ట కొండను చాలా వరకు తొలిచేచి ఎడ్లబండి నడిచే దారిని నేడు వంద అడుగులకు పై విస్తరించారు. ఈ రోడ్డు నిర్మాణంలోనే సర్వే నెంబర్లు 624, 2, 108లలో సుమారు 9.93 ఎకరాల భూములను ఆక్రమించి రోడ్లు వేశారు. ఈ ఆక్రమణలపై స్థానికుల ఒత్తిడితో అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. ఆ బోర్డులు ఉంటే లే-అవుట్‌కు ఇబ్బంది వస్తుందని తొలగించినట్లు పత్రికల్లో బుధవారం వార్తలు వచ్చాయి. 9/77 అసైన్డ్ చట్టం ప్రకారం ఆ భూములకు సంబంధించి ఎటువంటి అమ్మకాలు, కొనుగోలు జరపరాదు. దీనికి భిన్నంగా విస్సన్నపేటలో జరిగింది. ఈ భూముల చుట్టూ ఉన్న వాగులు, ఇతర ప్రభుత్వ భూములు కూడా ఆక్రమించుకున్నారు. అసైన్డ్ భూములు పేదలకు దక్కాలి తప్ప రియల్‌ఎస్టేట్ వ్యాపారస్తులకు కాదు. ఇలాంటి భూ ఆక్రమణలు జరుగుతున్నప్పుడు వెంటనే జిల్లా రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకుంటే లబ్ధిదారులకు, ప్రభుత్వానికి ఎటువంటి నష్టం వాటిల్లదు." కావున తమరు వెంటనే ఈ భూముల విషయంపై జోక్యం చేసుకొని సమగ్ర విచారణ జరిపించి, అక్రమాలకు పాల్పడిన దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

మొదటి పేజీ తరువాయి..

అక్రమ నిర్మాణాలకు ఆకాశమే హద్దు!

కో-ఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి సైతం పిలిచి ఈయనకు అక్షితలు వేసినా దులిపేసుకున్నట్లు భోగట్టా. అధికారులెవరైనా ఫిర్యాదులు స్వీకరించి ఇలాంటి అక్రమ కట్టడాలపై క్షేత్రస్థాయిలో పరిశీలనకు వచ్చినా వారిని అటువైపు కన్నెత్తి చూడనివ్వకుండా సదరు కార్పొరేటర్ బెదిరించడం ఆనవాయితీగా మారింది. తాజాగా నాలుగురోజుల క్రితం తన పుట్టినరోజు వేడుకల్లో పత్రికలకు అడ్వర్టైజ్‌మెంట్ ఇచ్చుకున్న సదరు కార్పొరేటర్ చెల్లింపులు మాత్రం సదరు అక్రమ భవన నిర్మాణ యజమాని నుంచీ వసూలు చేసినట్లు శ్రీనివాసనగర్ ప్రజల్లో చర్చనీయాంశమైంది. తన సొంత వేడుకలకు బిల్డర్స్ ద్వారా, యజమానుల ద్వారా చెల్లింపులు చేయించడం సదరు అధికార కార్పొరేటర్‌కు అలవాటే అంటూ ఆ పార్టీ స్థానిక నాయకులు సైతం పెదవి విరుస్తున్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రతినిధి

ఘనంగా బ్యాంక్ ఆఫ్ బరోడా ఖాతాదారుల సదస్సు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రాంతీయ కార్యాలయం విశాఖపట్నం ఆధ్వర్యాన వ్యాపారస్తులు, నిరుద్యోగ యువతతో ఎంఎస్ఎంఇ రుణాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రీజనల్ మేనేజర్ వైవిఎస్ కోటేశ్వరరావు, డిప్యూటీ రీజనల్ మేనేజర్ కె.రవీంద్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం వ్యాపారం చేస్తున్న వారికే కాకుండా వ్యాపారం ద్వారా స్థిరపడాలనే నిరుద్యోగ యువతకు ఉపయోగకరమైన వివిధ రుణ పథకాలు - ముద్ర యోజన, బరోడా ప్రాపర్టీ ఫ్లైడ్, ప్రీమియం లోన్ అగైనెస్ట్ ప్రాపర్టీ , కమర్షియల్ వాహన రుణాల గురించి వివరించారు. రూ.పదివేల ముద్రులోను మొదలు రూ.పదికోట్ల రుణాల గురించి రీజనల్ కార్యాలయం రుణవిభాగ అధికారి సంతోష్ వివరించారు. అనంతరం రీజనల్ మేనేజర్ వైవిఎస్ కోటేశ్వరరావు ద్వారా రుణ లబ్ధిదారులకు రూ.33 కోట్లు వరకు మంజూరు చేసిన రుణాల పత్రాలను అందించారు.

'22ఎ నుంచి భూమిని మినహాయించాలి'

ప్రజాశక్తి- కలెక్టరేట్, విశాఖ : తమ భూములను 22 ఎ నుంచి మినహాయించాలని సీనియర్ సిటిజన్ కాజా చెన్నారావు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తాను మధురవాడ సూర్యశక్తి నగర్‌లో నివాసం ఉంటున్నానని, గత నెల 31న తనకు న్యాయం చేయమని కోరుతూ మెర్సికిల్లింగ్ కోసం అనుమతి ఇవ్వమని జిల్లా కలెక్టర్ మల్లికార్జునను కోరినట్లు తెలిపారు. మరలా ఈ నెల 15న స్పందనలో కలెక్టర్‌ను కలిసి ఇదివరకు ఇచ్చిన ఫిర్యాదుపై స్పందన ఏమైంది అని వివరణ కోరగా, కలెక్టర్ కోపంగా స్పందిస్తూ ఆత్మహత్య చేసుకో అంటూ తనను అందరి ముందు అవమానించారని చెప్పారు. అంతే కాకుండా తాను చెప్పిన మాటలు అబద్ధం అని మీడియాతో కలెక్టర్ చెప్పారని, ఇలా అబద్ధాలు మాట్లాడిన కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్‌గా అర్హులేనా అని ప్రశ్నించారు. నేర స్వభావం కలిగిన వారిని రక్షించాలని చూస్తున్నారని ఆరోపించారు. సీనియర్ సిటిజన్‌గా న్యాయం మాత్రమే ఆశిస్తున్నామని, 2018 నుంచి ఇప్పటి వరకు విశాఖ జిల్లాలో పనిచేసిన ఐఎఎస్ అధికారులు తమ భూములపై ఉన్న 22ఎ ఆంక్షలపై ఎటువంటి న్యాయం చేయలేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి తమ భూములపై 22 ఎ ఆంక్షలు ఎత్తివేసి, అపార్ట్మెంట్లకు ఏ విధంగా నిర్మించుకోవడానికి పర్మిషన్ ఇస్తున్నారో అదే విధంగా తమ భూమికి పర్మిషన్లు ఇచ్చి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆయనతో ఆర్‌టిఎ జిల్లా కన్వీనర్ సత్యనారాయణ ఉన్నారు.

జగన్ దోకారెడ్డి : టిడిపి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ముస్లింలను మోసం చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఓ దోకా రెడ్డి అని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి నజీర్ ఆరోపించారు. గురువారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జగన్ ప్రభుత్వంలో ముస్లిం సమాజం పూర్తిగా మోసపోయిందన్నారు. ఆర్థికంగా, సామాజికంగా మైనార్టీలు వెనకబడ్డారని దుయ్యబట్టారు. ప్రముఖ పత్రికల్లో ముస్లిములకు పెద్ద ధోకా అనే శీర్షికన జగన్ పాలనపై వార్త రావడంతో, దానిని ఖండిస్తూ, రాష్ట్ర మైనార్టీ శాఖా మంత్రి అంజద్ భాషా మాట్లాడటం శోచనీయం అన్నారు. జగన్ ప్రభుత్వంలో ముస్లిములకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని మంత్రి కొల్లబొల్లి కబుర్లు చెప్పారని విమర్శించారు. రంజాన్ తోఫా, విదేశీ విద్యను రద్దు చేశారని, మసీదులకు, దర్గాలకు మరమత్తుల కోసం ఇచ్చే నిధులను నిలుపుదల చేశారని తెలిపారు. వక్ఫ్ అస్తులు ఆక్రమించుకొని, ఉర్దూ భాష నిర్వీర్యంతో పాటు ఇమ్మమ్, మౌజన్ జీతాలు రద్దుచేశారని మండిపడ్డారు. యువతీ యువకుల దుఖాన్ మక్కాన్ స్కీమ్‌ను నిర్వీర్యం చేశారన్నారు. ముస్లిములను ధోకా చేశారు కాబట్టి ముస్లిం సమాజం అతనిని దోకా రెడ్డిగా పిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సెల్ వైస్ ప్రెసిడెంట్ చిన్న రెహమాన్, రాష్ట్ర మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అబ్దుల్ అనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

26, 27 తేదీలలో జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ మహాసభలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా 10వ మహాసభలు శని, ఆదివారాలలో డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు యూనియన్ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభల సందర్భంగా శనివారం సరస్వతి పార్కు నుంచి ఉదయం 10 గంటలకు వేలాది మంది కాంట్రాక్ట్ కార్మికులతో భారీ ప్రదర్శన, అనంతరం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ ప్రదర్శనలో కాంట్రాక్ట్ కార్మికులందరూ కుటుంబాలతో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, అధ్యక్షులు జి.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి ఎంవి.ప్రసాదరావు పిలుపునిచ్చారు. ఈ మహాసభలకు ముఖ్యవక్తలుగా ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, వేతనం రూ.28 వేలు ఇవ్వాలనే డిమాండ్లతో అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులపై చేస్తున్న దాడులను, కార్మికుల సమస్యలపై గత మూడేళ్ళలో నిర్వహించిన పోరాటాలు, విజయాలను మహాసభ సమీక్షించుకొని భవిష్యతు ఉద్యమాలకు సిద్ధమవుతామని తెలిపారు. కార్మికవర్గానికి ద్రోహం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ ఐక్య పోరాటాలకు దిశానిర్దేశం చేయబోతున్నట్లు పేర్కొన్నారు.

ఇగ్నోలో బిఇడి, బిఎస్సీ నర్సింగ్, పిహెచ్‌డి ప్రవేశాలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం జనవరి 2023 విద్యా సంవత్సరానికి గానూ బిఇడి, బిఎస్సీ నర్సింగ్ కోర్సులకు, జులై 2022కి సంబంధించిన పిహెచ్‌డి ప్రవేశాలకోసం ప్రకటన జారీ చేసింది. ఈ కోర్సులలో ప్రవేశాలు ప్రవేశ పరీక్ష ఆధారంగా మెరిట్ పద్ధతిన జరుగుతాయని ఇగ్నో ప్రాంతీయ సంచాలకులు గోనిపాటి ధర్మారావు తెలిపారు. ప్రవేశ పరీక్షలు దేశంలోని అన్ని ప్రాంతీయ కేంద్రాల పరిధిలో జరుగుతాయని వివరించారు. ప్రవేశ పరీక్షలు 2023 జనవరి 8న ఉంటాయని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షలు రాయాలనుకునే వారు ఆన్ లైన్ లింకుల ద్వారా డిసెంబరు 20వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కోర్సులకు సంబంధించి అర్హత, ఇతర వివరాలు ప్రాస్పెక్టస్‌లో ఉంటాయని తెలిపారు. మరింత సమాచారంకోసం ఎంవిపి కాలనీలోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని గానీ, ఇగ్నో అధయన కేంద్రాలనుగానీ, 0891-2511200ను సంప్రదించాలని సూచించారు. బిఇడి ప్రవేశ పరీక్ష దరఖాస్తు లింకు: https://eportal.ignou.ac.in/entrancebed/, బిఎస్సీ నర్సింగ్ ప్రవేశ పరీక్ష దరఖాస్తు లింకు: https://ignounursing.samarth.edu.in/, పిహెచ్ డి ప్రవేశ పరీక్ష దరఖాస్తు లింకు: https://ignouphd.samarth.edu.in/, ఈ-మెయిలు: rcvisakhapatnam@ignou.ac.in, వెబ్‌సైటు: http://rcvishakhapatnam.ignou.ac.inద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సిబిసిఎన్‌సి భూముల టిడిఆర్ జారీలో భారీ కుంభకోణం

టిడిపి క్రిస్టియన్ విభాగం అధ్యక్షుడు ఉరుకూటి డేవిడ్

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : సిబిసిఎన్‌సి భూముల టిడిఆర్ జారీలో భారీ కుంభకోణం జరిగిందని టిడిపి విశాఖ పార్లమెంట్ క్రిస్టియన్ విభాగం అధ్యక్షుడు ఉరుకూటి డేవిడ్ ఆరోపించారు. బుధవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, క్రిస్టియన్ మిషనరీ, బాలల సాంఘిక సంక్షేమ శాఖ భూముల తగాదాలు కోర్టులో ఉన్నాయన్నారు. ప్రభుత్వ భూములను మున్సిపల్ కమిషనర్లతో టిడిఆర్ రూపంలో కోట్ల రూపాయల్ని ధారాదత్తం చేస్తున్నారని, అందులో భాగంగా సిబిసిఎన్‌సి, బాలల సాంఘిక సంక్షేమ స్థలాలను కబ్జా చేయడమే కాకుండా, వైసిపి నాయకులు అధికారులను బెదిరిస్తూ ట్రాన్స్‌ఫర్లు చేయిస్తూ టిడిఆర్ రూపంలో కోట్ల రూపాయల్ని దోచుకుంటున్నారని విమర్శించారు. ఈ కుంభకోణంలో ఎంపి ఎంవివి సత్యనారాయణ, ఆడిటర్ జీవీ, వారి బినామీల హస్తం ఉందని ఆరోపించారు. ఈ కేసు కోర్టులో ఉన్నందున టిడిఆర్ సొమ్ము కోర్టులో జమ కావాలన్నారు. అలా కాకుండా ప్రైవేటు వ్యక్తులకు ఎలా దఖలు పరుస్తారని ప్రశ్నించారు. తక్షణమే టిడిఆర్‌లు రద్దు చేయాలని, అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. లేకుంటే న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో క్రిస్టియన్ నాయకులు ఉమా శంకరచౌదరి, రవి, జోసెఫ్, ఆంథోనీ, సోల్మాన్ రాజు పాల్గొన్నారు.

ఎయులో మూడు చెయిర్ ప్రొఫెసర్ల ఏర్పాటు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఒకేరోజు మూడు చెయిర్ ప్రొఫెసర్‌లు ఏర్పాటయ్యాయి. ఉదయం సింబయాసిస్ టెక్నాలజీస్ సంస్థ మేనేజింగ్ పార్టనర్ ఓ.నరేష్ కుమార్ ఏయూలో 'సింబయాసిస్ టెక్నాలజీస్' పేరుతో చెయిర్ ప్రొఫెసర్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి సంబంధించిన అధికారిక లేఖను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌కు అందజేశారు.

మాప్ అవెన్యూస్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.మన్మోహన్ ఏయూలో 'షేక్ సైదూన్ మసూమ బేగం' పేరుతో చెయిర్ ప్రొఫెసర్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదన చేస్తూ లేఖను రిజిస్ట్రార్‌కు అందజేశారు. లీ ఫార్మ లిమిటెడ్ డైరెక్టర్ ఎ.లీలారాణి వీసీ ప్రసాద రెడ్డితో సమావేశమయ్యారు. ఏయూతో తమ సంస్థ తరపున చెయిర్ ప్రొఫెసర్ ఏర్పాటు చేయడానికి అంగీకారం తెలిపారు. కార్యక్రమంలో ఏయూ అకడమిక్ సెనేట్ సభ్యులు కుమార్ రాజ తదితరులు పాల్గొన్నారు.

డైట్ అధ్యాపకుల సందర్శన

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి, ఒకటోవార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలను భీమిలి ప్రభుత్వ డైట్ అధ్యాపకులు ఎస్ త్రినాధరావు గురు వారం సందర్శించారు సమయపాలనపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. హెచ్ఎం రెడ్డిపల్లి అప్పలరాజు, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ మానసా దేవి, ఉపాధ్యాయులు రమేష్, నాగ మణి పాల్గొన్నారు. అంతకు ముందు థాంక్స్ గివింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు.

చిన్నారుల దత్తతపై అవగాహన

ప్రజాశక్తి -కంచరపాలెం : చిన్నారుల దత్తత నిబంధనలు ప్రకారమే జరగాలని, అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలుంటాయని అర్బన్-1సిడిపిఒ ఎంవి.రమణికుమారి అన్నారు. అంతర్జాతీయ దత్తత అవగాహన మాసోత్సవాల్లో భాగంగా ఆర్అండ్‌బి దరి శిశుగృహాలో చట్టబద్ధమైన దత్తతపై అవగాహన కల్పించారు. పిల్లలను దత్తతకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే, వారి ఇళ్లను శిశుగృహ సిబ్బంది పరిశీలించి, కలెక్టర్‌కు నివేదిస్తారని, అక్కడి నుంచి అనుమతులొస్తేనే దత్తత జరుగుతుందన్నారు.పిల్లల దత్తత తీసుకున్నాక రెండేళ్లపాటు శిశుగృహ సిబ్బంది పర్యవేక్షణ ఉంటుందన్నారు కార్యక్రమంలో బాలల సంరక్షణాధికారి బి.మమత, శిశుగృహ మేనేజర్ ఎ.సుజాత, లోవరాజు, సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

బిటి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : 14వవార్డు నరసింహనగర్, పోర్టు స్టేడియం వెనుక ఇంటర్నల్ బిటి రోడ్డు పనులకు రూ.38లక్షలతో నిర్మాణానికి వార్డు కార్పొరేటర్ కె.అనిల్ కుమార్‌రాజు ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె రాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, గడపగడపలో వచ్చిన విజ్ఞప్తి మేరకు నిధులు మంజూరు చేయించి, అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాక్సర్ రాజు, ఎఇ శ్రీరామమూర్తి, బల్ల శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పనను స్పెషల్ చీఫ్ సెక్రెటరీ డాక్టర్ రజిత్ భార్గవ్ గురువారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఎఇఒ నరసింహారాజు ఆలయ సాంప్రదాయ ప్రకారం సాదరంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం స్వామి తీర్థప్రసాదాలను అందజేశారు.

నిర్మాణ పనులు పరిశీలించిన కార్పొరేటర్

ప్రజాశక్తి- సింహాచలం: 98 వార్డు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం గురువారం పరిశీలించారు. శ్లాబ్ పనులను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఇమ్మంది పైడిరాజు, స్థానిక టిడిపి నేతలు పంచదార శ్రీనివాసరావు, నరసింహరాజు పాల్గొన్నారు.

సారా పులుపు ధ్వంసం

ప్రజాశక్తి- చీడికాడ : జైతవరం గ్రామ సచివాలయ పరిధి బి.సింగవరం ఏటి ఒడ్డున నాటుసారా తయారీకి సిద్ధం చేసిన రెండు ప్లాస్టిక్ డ్రమ్ముల్లోని నాలుగు వందలు లీటర్ల బెల్లం పులుపును మహిళా పోలీస్ డి.దేవి గుర్తించి ధ్వంసం చేసారు. గ్రామాలలో నాటు సారా తయారు చేసినా, అమ్మినా చట్ట విరుద్ధమని, వారిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.కార్యక్రమంలో వాలంటీర్లు పాల్గొన్నారు.

12 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏఎల్‌పురం శివారులో గొలుగొండకు చెందిన దుర్గాప్రసాదరావు అనే వ్యక్తి నుంచి12 మద్యం బాటిళ్లను పట్టుకున్నామని కేడిపేట ఎస్ఐ ఎ.సూర్యనారాయణ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

'22ఏ' బాధితులందరికీ ఒకేలా న్యాయం



22ఏ నుంచి తొలగింపు పత్రాలను చూపుతున్న బండారు

మాజీమంత్రి బండారు సత్యనారాయణ

ప్రజాశక్తి-పెందుర్తి/ సింహాచలం : సింహాచల దేవస్థానం పంచ గ్రామాల పరిధిలోని '22ఎ' జాబితాలో చేర్చిన భూములన్నింటికీ ఒకే విధంగా న్యాయం చేయాలని మాజీ మంత్రి బండారు సత్యనారాయణ డిమాండ్ చేశారు. వేపగుంట సర్వేనెంబర్ 30 లో 42 ఎకరాల భూమిని మాత్రమే '22ఎ' నుంచి తొలగించి, బడాబాబులకు దారాధత్తం చేయాలని ప్రభుత్వం చూస్తోందన్నారు. సర్వే నెంబర్ 30లో 42 ఎకరాలు భూమిని '22ఎ' నుంచి ఏ విధంగా తొలగించారో, అదేవిధంగా వేపగుంట పురుషోత్తపురం, అడివివరం, చీమలాపల్లి, వెంకటాపురంలో ఉన్న ఇనాం జీరాయితీ భూములను 22ఏ నుండి తొలగించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. 22ఏలో ఉన్న రైతు హక్కుదారులను గుర్తించి, అందరికీ ఒకేలా న్యాయం చేయాలని కోరారు. సిసిఎల్ ద్వారా 42 ఎకరాలను 22ఏ నుంచి తొలగించినప్పుడు, మిగిలిన భూములకు అది ఎందుకు సాధ్యకాదని ప్రశ్నించారుపంచగ్రామాల రైతులందరికీ న్యాయం చేయకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విశాఖపట్నం పార్లమెంటు నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి పాసర్ల ప్రసాద్ కార్పొరేటర్ లు పీవీ నరసింహం 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

జిరాయితీ స్థలం కబ్జాపై టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి -గాజువాక : కూర్మన్నపాలెంలో సర్వేనెంబర్105లోని జిరాయితీ స్థలాన్ని వైసిపి చెందిన కొంతమంది వ్యక్తులు దొంగ డాక్యుమెంట్లు సృష్టించి, కబ్జా చేయాలని చూస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు పల్లాశ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు బాధ్యులపై తగు చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం చేయాలని తహశీల్దార్ సుజాతకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితులు తరపున శ్రీనివాసరావు మాట్లాడుతూ, కొన్నేళ్ల క్రితం కొనుగోలు చేసిన స్థలాన్ని దొంగడాక్యుమెంట్లు సృష్టించి కబ్జా చేయాలని చూస్తున్నారని, నిజమైన భూహక్కుదారులను బెదిరిస్తున్నారన్నారు. ఈ అక్రమానికి దువ్వాడ సిఐ వత్తాసు పలుకుతూ, బ్రోకర్లు కొమ్ముకాయడం దుర్మార్గమన్నారు. అంతేకాక సివిల్ వ్యవహారాల్లో సిఐ వ్యవహరిస్తున్న తీరు అభ్యంతరకరంగా ఉందని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన టిడిపి పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పల్లా

సాగునీటి పంటల ప్రణాళిక అమలుపై శిక్షణ



మాట్లాడుతున్న ఎడి లక్ష్మణరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని దాకమర్రిలో ఇల్లందేవి చెరువు ఆయకట్టు రైతులకు సాగునీటి పంటల ప్రణాళిక అమలుపై గురువారం శిక్షణ ఇచ్చారు. శారదా వేలీ డెవలప్‌మెంట్ సమితి ప్రతినిధి జిఎల్ నాయుడు ఆధ్వర్యంలో ప్రపంచ బ్యాంకు, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ఎపిఐఐఎటిపి ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్వహించిన శిక్షణలో భూగర్భ జలవనరుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి లక్ష్మణరావు మాట్లాడుతూ, రబీ సీజన్‌కు సంబంధించి నవంబర్ మొదటివారంలోనే సాగునీటి ప్రణాళిక తయారుచేసుకోవాలని సూచించారు. ఎపిడి రమేష్‌బాబు మాట్లాడుతూ, నీటి లభ్యత ఆధారంగా, క్రమపద్ధతిలో సాగునీటి యాజమాన్య పద్ధతులు అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిడి భాస్కర్‌దేవ్, సర్పంచ్ చెల్లూరి పైడప్పుడు, ఎఇ వెంకటరమణ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి లక్షణాలపై అవగాహన

ప్రజాశక్తి -ఆనందపురం: చర్మంపై స్పర్శ లేని, రాగి రంగు కలిగిన మచ్చలు ఉంటే అవి కుష్టువ్యాధి లక్షణాలు కావచ్చని, వెంటన సమీప ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వ్యాధినిర్ధారణ పరీక్షలు చేయించుకుని ప్రభుత్వపరంగా ఉచితంగా ఇచ్చే మందులు వాడడం ద్వారా నివారించవచ్చని సామాజిక ఆరోగ్య అధికారి పి. సాంబమూర్తి సూచించారు. గురువారం నేలతేరు కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులకు కుష్టువ్యాధిపై అవగాహన కల్పించారు. డిపిఎంఒ బి. భీమేశ్వరరావు, కస్తూర్బా పాఠశాల ఎస్ఒ ఎం.చంద్రకళ, హెచ్ఎస్ ఎన్‌వి.రమణ, ఆరోగ్య కార్యకర్తలు ఎం.సత్యవతి, దేవి. ఆశా కార్యకర్త ఉమా పాల్గొన్నారు

ఎయిడ్స్‌పై అవగాహన..

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని చిప్పాడ, తాటితూరు గ్రామాల్లో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై గురువారం అవగాహన కల్పించారు. గర్భిణులు విధిగా ఎయిడ్స్ నిర్ధారణ పరీక్షల చేయించుకోవాలన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణా సంస్థ ఆదేశాలతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ , సీడ్ మొబైల్ ఐసిటిసి ఆధ్వర్యంలో 42 మందికి రక్త పరీక్షలు జరిపారు. లాబ్ టెక్నీషియన్ కిషోర్, లింక్ వర్కర్ జ్యోతి,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

'గాయత్రీ'లో మైండ్ కంట్రోల్‌పై సదస్సు

ప్రజాశక్తి -మధురవాడ : రుషికొండ గాయత్రి విద్యా పరిషత్ కళాశాలలో ఇస్కాన్ సౌజన్యంతో ఫస్టియర్ ఇంజినీరింగ్ విద్యార్థులకు మైండ్ కంట్రోల్ అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జాహ్నద్వీప నితాయి దాసు, విద్యార్థులు ఒత్తిడిని అధిగమించడం, వ్యసనాల జోలికి పోకుండా ఉండాలంటే ఏం చేయాలనే అంశాలపై వివరించారు. కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ కెవిఎస్ శర్మ, డాక్టర్ ఎస్ కృష్ణవేణి, డాక్టర్ ఫ్లోరెన్స్, డాక్టర్ లక్ష్మీనారాయణ, శివకష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి -భీమునిపట్నం : విద్యుత్‌లైన్ మరమ్మతులు, నిర్వహణలో భాగంగా నాలుగో వార్డు తిమ్మాపురం, కె నగర పాలెం, సోమన్న పాలెం, రెడ్డీల పాలెం, కాపుల దిబ్బడిపాలెం, మంగమారి పేట, గొల్లలపాలెం, కాలులుప్పాడ జగనన్న కాలనీ, వుడా అపార్ట్‌మెంట్, గ్రే హౌండ్స్ తదితర ప్రాంతాల్లో ఈ నెల 25నఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయ నున్నట్లు స్థానిక విద్యుత్ ఎఇఇ యు.శేఖరయ్య తెలిపారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

నేరాలు ఘోరాలు



ప్రమాదానికి గురైన బస్సు ,లారీ

త్రుటిలో తప్పిన ప్రమాదం

శ్రీ ప్రకాష్ స్కూల్ బస్సును ఢీకొన్న లారీ

బస్సులో 45 మంది విద్యార్థులు ప్రయాణం

ముగ్గురు విద్యార్థులకు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి గురుకులం జంక్షన్ వద్ద పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ స్కూల్ బస్సును తుని నుంచి అడ్డరోడ్డు వైపు వస్తున్న లారీ వేగంగా ఢీకొట్టింది.ప్రమాదం నుండి విద్యార్థులు ఎటువంటి గాయాలు కాకుండా బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.పాయకరావుపేట నుండి శ్రీ ప్రకాష్ బస్సు స్కూలు ముగిసిన తర్వాత పిల్లలను దింపడానికి అడ్డ రోడ్డు బయలుదేరింది.నక్కపల్లి వద్ద వచ్చేసరికి వెనక నుండి వస్తున్న లారీ బస్సును బలంగా ఢీకొంది. దీంతో బస్సు కల్వర్టుపైకి దూసుకుపోయి ఒక పక్కకు ఒరిగిపోయింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో బస్సు బోల్తాపడకుండా కాపాడగలిగారు. బస్సులో 45 మంది విద్యార్థులు ఉన్నారు.ప్రమాదం జరిగిన వెంటనే పిల్లలంతా ఒక్కసారిగా ప్రాణభయంతో హాహాకారాలు చేశారు. ఒకరిపై ఒకరు పడిపోవడంతో ముగ్గురు గాయపడ్డా రు. వారిలో నక్కపల్లి కి చెందిన ఉప్పలపు గురుసాయి, నున్న హాసి, డి.వాసు వున్నారు. వారిలో వాసు నక్కపల్లి ఆస్పత్రిలోనూ, మిగిలిన ఇద్దరు పిల్లలు డాక్టర్ కిశోర్ కుమార్ వద్ద వైద్యసేవలు పొందారు. ప్రమాద సంఘటన విద్యార్థులు తల్లిదండ్రులకు తెలియడంతో భయం దోళన చెంది హుటాహుటిన ప్రమాద స్థలికి చేరుకున్నారు .రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ సంఘటనా స్థలానికి చేరుకుని సహాయకచర్యలు చేపట్టారు. రెప్పపాటులో స్కూల్ పిల్లలకు పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ బస్సులో వున్న పిల్లలంతా నక్కపల్లి, అడ్డరోడ్డుకు చెందిన వారే.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత చిన్నారులు

చీరకు నిప్పంటుకుని మహిళ మృతి

ప్రజాశక్తి-పాయకరావుపేట: ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకోవడంతో మండలంలోని కేశవరం గ్రామానికి చెందిన మేడిశెట్టి చిన్నమ్మాయి గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు... మేడిశెట్టి చిన్నమ్మాయి వంట గదిలో టీ కాస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుంది ఈప్రమాదంలో తీవ్ర కాలిన గాయాలైన బంధువులు తుని ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుండి కాకినాడ జిల్లాకేంద్ర ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో మృతి చెందింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసినట్లు సిఐ పాలిన అప్పలరాజు తెలిపారు.

16 తులాల బంగారం చోరీ

ప్రజాశక్తి- పెందుర్తి : 94వ వార్డు వేపగుంట మెయిన్ రోడ్డును ఆనుకొని ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లోని నాయుడు దంపతులు గురువారం ఉదయాన్నే గుడిలో పూజకు వెళ్లి, తిరిగొచ్చేసరికి ఇళ్లంతా చిందరవందరగా ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పరిశీలించగా, 16తులాల బంగారం పోయిందని బాధితులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేఇస సిసి ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

క్రికెటర్ షబ్నంకు ఘనసత్కారం



షబ్నంను సత్కరిస్తున్న కెకె.రాజు, బర్కత్ ఆలీ

ప్రజాశక్తి -కంచరపాలెం : జాతీయ మహిళా క్రికెట్ జట్టుకు ఎంపికైన మర్రిపాలేనికి చెందిన ఎండీ షబ్నం ఎంపిక కావడంపై హర్షం వ్యక్తమౌతోంది. గురువారం 53వ వార్డు. డాక్టర్ జాకీర్ హుస్సేన్ నగర్ మజీద్ ఈ అల్ ఖదీర్ కమిటీ ఆధ్వర్యంలో మస్జిద్ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో షబ్నంను ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, జివిఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యుడు, స్థానిక కార్పొరేటర్ బర్కత్ ఆలీ దుశ్శాలువాతో సత్కరించి, అభినందించారు.
ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, 15మంది సభ్యుల జాతీయజట్టులో షబ్నం స్థానం సంపాదించడం ఆషామాషీ కాదన్నారు. క్రికెట్‌లో అత్యుత్తమంగా రాణించి, విశాఖ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింప జేయడంతోపాటు ఉన్నతశిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. షబ్నంకు అవసరమైన సహకారాన్ని అందించేందుకు ఎల్లవేలలా సిద్ధమని ప్రకటించారు. షబ్నం తల్లిదండ్రులు మొహమ్మద్ షకీల్, కరణం ఈశ్వరమ్మ (సల్మా)లను ప్రత్యేకంగా అభినందించారు.
బర్కత్ అలీ మాట్లాడుతూ జాతీయజట్టుకు షబ్నం ఎంపికతో మర్రిపాలెంలో పండగ వాతావరణం నెలకొందన్నారు. కార్యక్రమంలో మస్జిద్ కమిటీ అధ్యక్షులు మున్నా, కార్యదర్శి అన్సర్ వల్లి, సహాయక కార్యదర్శి నూరి, శివశివాని స్కూల్ అడ్వైజర్ ఇక్బాల్ బేగం, ప్రిన్సిపల్ రోజిదూత, భాష, రామలక్ష్మి, రామారావు పాల్గొన్నారు.
అంతే కాకుండా 297, 298 సచివాలయాల పరిధిలో లబ్ధిదారులకు ఇళ్ళ పట్టాలను కెకె.రాజు పంపిణీ చేశారు. పోలి పాడ్యమి సందర్శంగా కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అన్నసమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలలో బూస రామలక్ష్మిరెడ్డి, ఈదుల రామారావు, అలజంగి కృష్ణ, రామశాస్త్రి, చిన్న, కోసూరు నాగేశ్వరరావు, లక్ష్మిపాల్గొన్నారు

జూపార్కుకు ఎక్స్‌రే పరికరం అందజేత


ఎక్స్‌రే పరికరాన్ని ప్రారంభిస్తున్న భారత్ డైనమిక్స్ ప్రతినిధులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా రూ.15 లక్షలు విలువ చేసే ఎక్స్‌రే పరికరాన్ని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ సంస్థ అందజేసింది. గురువారం జూపార్కు వెటర్నరీ ఆసుపత్రిలో ఎక్స్‌రే పరికరాన్ని సంస్థ వైజాగ్ యూనిట్ జనరల్ మేనేజర్ ఎస్‌వి కామేశ్వర్, హెచ్‌ఆర్ ఎన్.సత్యనారాయణ డిఎఫ్ అనంతశంకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎసిఎఫ్ జి.మంగమ్మ, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ శ్రీనివాస్, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలనాయుడు పాల్గొన్నారు.

త్వరితగతిన బయోమెట్రిక్ నమోదు



బయోమెట్రిక్ నమోదును పరిశీలిస్తున్న సర్వశిక్ష సిఎంఒ

ప్రజాశక్తి -ఆనందపురం: విద్యార్థుల బయోమెట్రిక్ నమోదు ప్రక్రియను వేగవంతం చేసి అప్‌లోడ్ చేయాలని సమగ్ర శిక్ష సిఎంఒ సిహెచ్.శిరీషరాణి అన్నారు గురువారం ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల బయోమెట్రిక్ పూర్తిస్థాయిలో తీసుకోవాలన్నారు. జిల్లాలో 620 పాఠశాలలో 92,721 మంది విద్యార్థులుంటే ఇప్పటివరకు 80శాతం బయోమెట్రిక్ నమోదైందన్నారు.అనంతరం మండల విద్యాశాఖ కార్యాలయంలో సిఆర్‌పిలతో సమావేశం నిర్వహించి, సూచనలు చేశారు.ఎంఇఒ పద్మావతి, హెచ్‌ఎం శ్రీనివాసరావు, సిఆర్‌పిలు శినగం శివాజీ, వెంకట్రావు, గౌరీ శంకర్‌నాయుడు, జీ.శివాజీ పాల్గొన్నారు

అన్న సమారాధన


భీమిలిలో అన్నసమారాధనలో రఘునాథరెడ్డి

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని చిప్పాడ పంచాయతీ మాజీ సర్పంచ్ సరగడ రఘునాథరెడ్డి, భారతమ్మ దంపతుల ఆర్థిక సాయంతో మండలంలోని లక్ష్మీపురం గ్రామంలోని శ్రీఅయ్యప్ప సేవా పీఠం వద్ద భక్తులకు గురువారం అన్నసమారాధన నిర్వహించారు.కార్యక్రమంలో సేవాపీఠం ధర్మకర్త గాడు తాతినాయుడు , భక్తులు పాల్గొన్నారు.

కరాస: 52వ వార్డు ఎన్ఎడి కొత్తరోడ్ జంక్షన్‌లోని ప్రమద ఉమామహేశ్వర ఆలయంలో కార్తీకమాసం ముగింపు సందర్భంగా గురువారం దేవాదాయశాఖ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, పశ్చిమ నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పాల్గొని, ప్రారంభించారు. ఆలయ కమిటీ చైర్మన్ గొంతిన రామకష్ణ, జియ్యని మారుతి, వెదుళ్ల శ్రీను, జియ్యని విజయకుమార్, అమర్, అంబటి లక్ష్మి, ప్రసాద్, పద్మ వెంకటరావు పాల్గొన్నారు.

డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో 'శ్రీకృష్ణా' కళాశాల విద్యార్థుల ప్రతిభ

- ఎయు టాపర్‌గా జీనత్ సుల్తానా



జీనత్ సుల్తానాను అభినందిస్తున్న కళాశాల చైర్మన్

ప్రజాశక్తి- తగరపువలస : ఆంధ్రా యూనివర్సి విడుదల చేసిన డిగ్రీ సెకెండియర్, నాలుగో సెమిస్టర్ ఫలితాల్లో స్థానిక శ్రీకృష్ణా డిగ్రీ కాలేజీ విద్యార్థులు సత్తా చాటారు.కాలేజీ విద్యార్థిని జీనత్ సుల్తానా నాలుగో సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో 10/10 గ్రేడింగ్ పాయింట్లు సాధించి, యూనివర్సిటీలోనే టాపర్‌గా నిలిచారని కళాశాల చైర్మన్ బి.నరసింగరావు తెలిపారు. ఎస్ వెంకటలక్ష్మి 9.73/10 పాయింట్లతో ద్వితీయ స్థానంలో నిలవగా, టి విజయలక్ష్మి 9.70 /10పాయింట్లతో ప్రతిభ చూపినట్లు తెలిపారు.అంతేకాక కాలేజీలో తొమ్మిదికంటే ఎక్కువ పాయింట్లు సాధించిన వారిలో 12మంది, ఎనిమిది పాయింట్లుకుపైగా గ్రేడింగ్‌తో 60 మంది ఉత్తీర్ణత సాధించి, ఏకంగా యూనివర్సిటీ స్థాయిలోనే 97 శాతం ఫలితాలను సాధించారని వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కాలేజీ చైర్మన్ బి.నరసింగరావు, ప్రిన్సిపాల్ జె సతీష్‌కుమార్, వైస్‌ప్రిన్సిపాల్ కె.చిట్టిరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సింహాచలం, ఇతర అధ్యాపకులు పుష్పగుచ్ఛాలను అందించి, అభినందించారు. మిఠాయిలు పంచిపెట్టారు.

పంచకర్లకు శుభాకాంక్షల వెల్లువ


పంచకర్లను సత్కరిస్తున్న కెకె.రాజు, ఇతర వైసిపి నేతలు

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖ జిల్లా వైసిపి అధ్యక్షుడిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. పంచకర్ల నియమిస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశాక, సీతమ్మధారలోని ఆయన నివాసం వద్ద సందడి నెలకొంది. పలువురు వైసిపి నేతలు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పంచకర్లకు శుభాకాంక్షలు తెలిపి, అభినందించారు.
ఈ సందర్భంగా పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన బాధ్యతను అందరి సమన్వయంతో సమర్ధవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీ ముఖ్యనేతలు వైవి సుబ్బారెడ్డి, విజయ సాయిరెడ్డికి కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు పాల్గొన్నారు

పంచకర్లను సత్కరించిన రాజు

ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు నియోజకవర్గ నేతలతో వచ్చి పంచకర్లను సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్లు కంపా హనోక్, అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ సభ్యుడు సారిపిల్లి గోవింద్, కార్పొరేటర్లు కె.అనిల్ కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, పి.ఉషశ్రీ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్ాజు, 48వార్డు ఇన్‌చార్జి నీలి రవి, సీనియర్ నేతలు బి.యన్ రాజు, సప్పంగి శ్రీను,కె.చిన్నా, జక్కంపూడి సత్యన్నారాయణ, జి.కృప పాల్గొన్నారు.

ఆరిలోవ నేతల అభినందన

ఆరిలోవ : పంచకర్ల రమేష్‌బాబును మాజీ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ అల్లంపల్లి రాజబాబు, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ పేర్ల విజయ్‌చందర్, నాయకులు గూడపాటి విక్టర్, వానపల్లి ఈశ్వరరావు, సత్యాల వెంకట్, పి. రామారావు, శంకరరావు సత్కరించి అభినందించారు.

ఎంవిపి కాలనీ : పంచకర్ల రమేష్‌బాబును వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

క్షతగాత్రునికి 'ఉపకార' ఆర్థిక సాయం


బాధితునికి ఆర్థిక సాయం అందిస్తున్న ఉపేంద్ర

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇటీవల ప్రమాదవశాత్తు శరీరం కాలిపోయిన 10వ వార్డు తోటగరువు, బిఎన్‌ఆర్‌నగర్‌కు చెందిన కూర్మారావుకు ఉపకార ఛారిటబుల్ ట్రస్టు అధినేత కంచర్ల అచ్యుతరావు ఆర్థికసాయం అందించారు.

గురువారం అచ్యుతరావు కుమారుడు సినీ హీరో కంచర్ల ఉపేంద్ర బాధితుని ఇంటికి వెళ్ళి పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం బాధితునికి రూ 10 వేలు ఆర్థిక సాయం అందించారు. ట్రస్టు సభ్యులు పొట్టి అప్పారావు, సుధీర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

26న టిఎన్‌టియుసి జాతీయ సమావేశం

ప్రజాశక్తి- విశాఖపట్నం: ఈనెల 26న శనివారం విజయవాడలో నిర్వహించే నేషనల్ టిఎన్‌టియుసి సమావేశాన్ని విజయవంతం చేయాలని యూనియన్ నేతలు పిలుపునిచ్చారు. గురువారం పెద్ద గంట్యాడ టిఎన్‌టియుసి కార్యాలయంలో ఉక్కు శ్రామిక సంఘం అధ్యక్షులు కరణం సత్యారావు ఆధ్వర్యంలో నిర్వహించిన సంఘం సమావేశంలో టిఎన్‌టియుసి నేషనల్ వైస్‌చైర్మన్ పాండ్రంగి జయరాజు నాయుడు, జనరల్ సెక్రెటరీ బొడ్డు పైడిరాజు మాట్లాడుతూ, విజయవాడలోయూనియన్ నేషనల్ చైర్మన్ ఆర్ రామ్మోహన్‌రావు, సెక్రటరీ జనరల్ జెవి.నరసింహారావు ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశంలో లాభాల్లో ఉన్న ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేకవిధానాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారన్నారు. యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు శేషగిరిరావు, రాష్ట్ర జనరల్ సెక్రటరీ నారా జోషి పాల్గొనే సమావేశానికి అధికసంఖ్యలో కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో విశాఖ ఉక్కు శ్రామిక సంఘం కార్యదర్శి ఎంకె.రెడ్డి, బొడ్డు రమణ మొల్లి ప్రకాష్, బొడ్డు రాజేష్, కరణం సురేష్, రాజుగారు, జాన్ అధిక సంఖ్యలో కాంట్రాక్ట్ కార్మికులు హాజరైనారు.

ఆహ్లాదంతోనే ఆనందం, ఆరోగ్యం


వరప్రసాద్‌కు తులసిమొక్కలు ఇస్తున్న శ్రీనివాస్

ప్రజాశక్తి- మాధవధార : ఆహ్లాదంతోనే ఆనందం తద్వారా ఆరోగ్యం వస్తుందని మురళీనగర వైశాఖి స్పోర్ట్స్ పార్క్ అధ్యక్షులు సనపల వరప్రసాద్ అన్నారు. గురువారం మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్ ప్రాంగణంలో వాకర్ మండపాక శ్రీనివాస్ 50 తులసి మొక్కలు, అన్ని వారాల భక్తి గీతలతో కూడిన ఏడు పెన్ డ్రైవ్లను సనపల వరప్రసాద్‌కు అందజేశారు వాకర్స్ పార్కులో 50తులసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా అధ్యక్షులు వరప్రసాద్ మాట్లాడుతూ మురళీనగర్ వాకర్స్ పార్క్‌లో ఎంతో మంది వాకర్స్ కోసం ఔషద గుణాలు కల్గిన తులసి మొక్కలు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వాకర్ మండపాక శ్రీనివాస్‌ను అభినందించారు. కార్యక్రమంలో పార్క్ సెక్రటరీ సూర్యనారాయణ, శంకు, వెంకటేశ్వరావు, రొంగలి జగన్నాథం, నాగరాజు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల సంఘం

జిల్లా ప్రధాన కార్యదర్శిగా నారాయణరావు


నారాయణరావు

ప్రజాశక్తి -అనందపురం : గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కడగల నారాయణరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 22న విశాఖపట్నంలో గ్రామీణ వైద్య సంఘం సమావేశంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జంగం జోషి, లీగల్ అడ్వైజర్ కెపి దేశయ్య, ఆంధ్రప్రదేశ్ కలాం ట్రస్ట్ చైర్మన్ మమ్ముల తిరుపతిరావు, సీనియర్ అడ్వైజర్ లాడ త్రినాథరావు సమక్షంలో నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

27న విశ్వబ్రాహ్మణ సంఘం ఎన్నికలు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు ఈ నెల 27న ముడసర్లోవ పార్కులో జరగనున్నట్టు సంఘం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి దనాలకోట శోభనబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సహాయ అధికారులుగా రాయల లక్ష్మణరావు, కాకమాను వెంకట వేణు వ్యవహరిస్తారన్నారు. ప్రజాస్వామ్యయుతంగా, పారదర్శకంగా ఎన్నికలు జరుగుతాయని, విజేతలకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు ప్రమాణ స్వీకారం చేయిస్తారన్నారు.

ప్రజాశక్తి 5
శుక్రవారం 25 నవంబర్ 2022

ప్రభుత రంగ సంస్థల ప్రయివేటీకరణతో రిజర్వేషన్లకు తూట్లు

- పోరాటాలతోనే ఎస్‌సి కమిషన్ ఏర్పాటు
- కెవిపిఎస్ సంఘం రాష్ట్ర నాయకులు చిరంజీవిరావు, వైటి దాస్



మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు వైటి.దాస్

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ జరిగితే వాటిల్లో రిజర్వేషన్లు అమలయ్యే పరిస్థితి ఉండదని కుల వివక్ష వ్యతిరేక పోరాటం సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర కమిటీ సభ్యులు చిరంజీవిరావు, వైటి.దాసు అన్నారు. స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో గురువారం కెవిపిఎస్ జిల్లా 5వ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజర్వేషన్ల వల్ల ప్రభుత్వ రంగ సంస్థల్లో అనేక మంది ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇతర తరగతుల వారు ఉద్యోగాలు పొందారని తెలిపారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ రిజర్వేషన్లకు తూట్లు పొడుస్తుందని విమర్శించారు. మరోవైపు బిజెపి ప్రభుత్వం వచ్చిన తరువాత దేశంలో దళితులపై దాడులు పెరిగాయని, సామాజిక వివక్ష ఎక్కువైందని తెలిపారు. అందువల్ల మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాల్లో దళితులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కెవిపిఎస్ స్థాపించి 25 ఏళ్లు అవుతుందని, ఈ కాలంలో అనేక దళిత సమస్యలపై పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతి, దేవాలయాల్లోకి దళితులను రానివ్వకపోవడం వంటి వివక్షలపై ఉద్యమించినట్లు చెప్పారు. కెవిపిఎస్ పోరాటాల ఫలితంగానే ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, ఎస్సీ కమిషన్ ఏర్పాటయ్యాయని తెలిపారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డి.వెంకన్న మాట్లాడుతూ దళితులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలు చేయాలని, ప్రతి దళిత కుటుంబానికి రెండు ఎకరాల చొప్పున ప్రభుత్వ భూమి పంచాలని, ఎస్‌సి కార్పొరేషన్‌కు నిధులు విడుదల చేయాలని, దళిత వాడలను అభివృద్ధి చేయాలని, సామాజిక భవనాలు నిర్మించాలని, దళితులకు శ్మశాన స్థలాలు కేటాయించాలని, ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ యాక్టును పటిష్ఠంగా అమలు చేయాలని, దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు.

కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ప్రసాద్, చిరంజీవి

అనంతరం కెవిపిఎస్ అనకాపల్లి జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గాడి ప్రసాద్, ఈరెల్లి చిరంజీవి, ఉపాధ్యక్షులుగా మంగళగిరి లోవరాజు, భూపతి అప్పారావు (పండు), సహాయ కార్యదర్శులుగా డి.చిరంజీవి, పూడి అర్జున్, మరో 18 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.


ప్రసాద్,


చిరంజీవి


పోటీలకు ఎంపికైన చోడవరం విద్యార్థులు

తైక్వాండో పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- చోడవరం

ఈ నెల 25, 26, 27 తేదీల్లో నంద్యాలలోని రామకృష్ణ పీజీ కాలేజ్ ఇండోర్ స్టేడియంలో జరగనున్న 2వ ఓపెన్ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 35 మంది విద్యార్థులు ఎంపికైనట్లు టైక్వాండో ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జ్, జిల్లా ఉపాధ్యక్షులు పల్లం మురళీకృష్ణ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ పోటీలకు చోడవరంకు చెందిన వి.జెసిక రోజీలి, ఎం.సంతోష్‌లక్ష్మి, ఎం. హేమశ్రీ, ఆర్.దీక్షిత, వి.లిఖిత, బి.సత్య రామచంద్ర, ఎన్.విష్ణువర్ధన్, జి.నాగ సాయిరామ్, జివి.శశివర్ధన్, వి.సాయి దశ్వంత్, పిఎస్ఎస్.తరుణ్, ఎస్.తనహ, వి.ఇసిత శారద, ఎ.చంటిబాబు, కె.రోహిత్, జికె సందీప్ ఉన్నట్లు చెప్పారు. దూలం రమేష్, శేఖర్, ఎం.సంతోష్ లక్ష్మి టీమ్ కోచ్‌లుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు టి.హర్ష వర్ధన్ ప్రసాద్, జిల్లా ప్రతినిధులు పి.గణేష్ కుమార్, చవల చంద్రశేఖర్, షేక్ ఆలీ, కె.ప్రదీప్ అభినందనలు తెలిపారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వ్యకాస నాయకులు

వ్యకాస రాష్ట్ర మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- సబ్బవరం

జంగారెడ్డిగూడెంలో డిసెంబర్ 8న జరగనున్న ఏపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 29వ మహాసభకు సంబంధించిన వాల్ పోస్టర్లను స్థానిక దుర్గమాంబ ముఠా కళాసీ సంఘం కార్యాలయ ఆవరణలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సత్తిబాబు మాట్లాడుతూ మహాసభకు పెద్ద ఎత్తున వ్యవసాయ కార్మికులు హాజరు కావాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు 200 పని దినాలు కల్పించాలని, రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల నాయకులు ఉప్పాడ సత్యవతి, కె.కోటేశ్వరరావు, ఎం.గౌరీశ్వరరావు, జి.నరసమ్మ, ఎల్లయ్య పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి కప్ ప్రైజ్‌మనీ క్రీడలు ప్రారంభం



క్రీడలు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపి సత్యవతి తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సౌజన్యంతో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో గురువారం ముఖ్యమంత్రి కప్ ప్రైజ్ మనీ జిల్లా స్థాయి క్రీడలు ప్రారంభమయ్యాయి. ఈ క్రీడలను స్థానిక ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జిల్లా క్రీడా ప్రాధికార అధికారి నాగిరెడ్డి సూర్యారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్‌పి ఉపాధ్యక్షురాలు బివి.సత్యవతి, ఎంపిపి గొర్లి సూరిబాబు, వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, యువజన విభాగం పట్టణ అధ్యక్షులు జాజుల రమేష్, ఎన్‌వైకె కో-ఆర్డినేటర్ మహేష్, శాప్ డైరెక్టర్ జొన్నాడ శ్రీనివాసరావు, స్కూల్ గేమ్స్ కార్యదర్శి శేఖర్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కెఎన్‌వి సత్యనారాయణ, ఉషోదయ విద్యా సంస్థ చైర్మన్ రమణాజీ, అనకాపల్లి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కోచ్ ఆఫీసు కోఆర్డినేటర్ వేణుగోపాల్, మోటూరు నాగేశ్వరరావు పాల్గొన్నారు.


పుస్తకాలు అందజేస్తున్న కృష్ణ తదితరులు

పుస్తక నిక్షిప్త కేంద్రానికి పుస్తకాలు వితరణ

ప్రజాశక్తి-అచ్యుతాపురం

జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో నిర్వహిస్తున్న పుస్తక నిక్షిప్త కేంద్రానికి అనకాపల్లికి చెందిన విశ్రాంత ఉద్యోగి కొణతాల కృష్ణ రూ.5వేలు విలువైన పుస్తకాలను సమకూర్చారు. ఈ పుస్తకాలను అనకాపల్లికి చెందిన ఉపాధ్యాయులు మళ్ల బాబునాయుడు, పిల్ల జగదీష్, తిమ్మిరాజుపేట ఉపాధ్యాయుడు మారిశెట్టి వెంకట అప్పారావు చేతులమీదుగా గ్రంథాలయ నిర్వాహకులకు గురువారం అందజేశారు. కొణతాల కృష్ణకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం నిర్వహించే పలు పోటీ పరీక్షలకు, డిప్లమో, బీటెక్, తదితర విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యలక్ష్మి బాబు నాయుడు, ఉపసర్పంచ్ భీశెట్టి రాము, గ్రామ అభ్యుదయ కమిటీ ప్రతినిధి ఆడారి నర్సింగరావు, ఆడారి శివ అప్పలనాయుడు, ఎల్లప్ప గోవిందా, కె భాస్కరరావు, భవిరిశెట్టి రవికుమార్ పాల్గొన్నారు. గ్రంథాలయాలన్నీ విరాళాలు సేకరణ ద్వారా అభివృద్ధి చేద్దామని ఈ సందర్భంగా తీర్మానం చేశారు.

కార్మికులకు ఇఎస్ఐపై అవగాహన

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని ఎఎస్.పేటలో వున్న చెట్టినాడ్ సిమెంట్ కంపెనీ కార్మికులకు ఇఎస్ఐ సౌకర్యంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇఎస్ఐ అధికారి వి.రఘునాథరావు మాట్లాడుతూ ప్రతి కార్మికుడు భవిష్యత్తు కోసం వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ యూనిట్ హెడ్‌జి జనార్దనరావు, హెచ్‌ఆర్ మేనేజర్ ఎం.నరసింహరాజు పాల్గొన్నారు.

రక్తదానం శిబిరం

చెట్టినాడ్ సిమెంట్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో విశాఖ రోటరీ బ్లడ్ బ్యాంక్ వారు గురువారం రక్త దానం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 51 మంది రక్తదానం చేశారు.



రక్తదానం చేస్తున్న చెట్టినాడ్ ఉద్యోగులు

తోటాడ హైస్కూల్‌కు సిసి కెమెరాల వితరణ


సిసి కెమెరాలను ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-మునగపాక రూరల్

మండలంలోని తోటాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గవర్ల అనకాపల్లి గ్రామానికి చెందిన వైసిపి మండల కోశాధికారి మళ్ల ఈశ్వరరావు పాఠశాల భద్రత దష్ట్యా లక్ష రూపాయలు విలువ చేసే 8 సీసీ కెమెరాలు, మోనిటర్ టీవీని సమకూర్చారు. గురువారం ఆయన తన కుటుంబ సభ్యులతో పాఠశాలలో సిసి కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్, సర్పంచ్ దొడ్డి మంగ వేణి, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, వైసీపీ నాయకులు షేక్ ఇస్మాయిల్, దొడ్డి బాలాజీ, దొడ్డి కోటేశ్వరరావు, సూరిశెట్టి భాస్కరరావు, పాఠశాల హెచ్ఎం కుమార్, సచివాలయ సిబ్బంది వెంకటరెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రాజ్యాంగ పీఠిక చదవాలి

ప్రజాశక్తి- దేవరాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ నెల 26న రాజ్యాంగం దినోత్సవం రోజున రాజ్యాంగ పీఠిక చదవాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కెవి.రమణ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భారతదేశానికి అందించిన రాజ్యాంగం కోసం అందరూ తెలుసుకోవాలన్నారు.

ఆర్‌బికెల ద్వారా విత్తనాలు

ప్రజాశక్తి-కె.కోటపాడు

పెసలు, మినుములు, వేరుశనగ విత్తనాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేస్తామని, కావాల్సిన వారు గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వేరుశనగ 30 కేజీలు బస్తా రూ.1500, పెసలు నాలుగు కేజీలు రూ.330, మినుములు నాలుగు కేజీలు రూ.330 రూపాయలు చొప్పున చెల్లించి గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

నేవీ నిర్వాసితుల సమస్యలపై కాలయాపన తగదు

సిపిఎం మండల కార్యదర్శి దేముడునాయుడు

ప్రజాశక్తి -రాంబిల్లి

నేవల్ బేస్ నిర్వాసితుల సమస్యలను 17 సంవత్సరాలుగా పూర్తిస్థాయిలో పరిష్కరించకుండా కాలయాపన చేయడం ప్రభుత్వాలకు తగదని సిపిఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు అన్నారు. నేవీ మెయిన్ గేటు ముందు ఎనిమిది గ్రామాల నిర్వాసితులు చేపట్టిన ఆందోళన గురువారం నాటికి 25వ రోజుకి చేరింది. ఈ సందర్భంగా దేముడునాయుడు నిర్వాసితులు తమ సమస్యలను పరిష్కరించాలని ఆందోళన బాట పెట్టినపుడు కొన్ని సమస్యల పరిష్కరించి మిగతా వాటిని పరిష్కరించకుండా వదిలేయడం పరిపాటిగా మారిందన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో వ్యవహరించి, జీవన భృతి కల్పించాలని, పెండింగ్ ప్యాకేజీలు అందజేయాలని, మత్స్యకారుల చేపలు వేటకు జెట్టీ నిర్మించాలని, నిర్మాణ పనుల్లో స్థానికులకు ఉపాధి కల్పించాలని, ఆధార్ కార్డు ఆధారంగా శారద, వరాహ నదుల్లో చేపలు వేటకు పంపాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ భూములకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, శ్మశాన స్థలాలు కేటాయించాలని, ప్రభావిత గ్రామాలను నిర్వాసిత గ్రామాలుగా గుర్తించి ప్యాకేజీలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఓబి నిర్వాసితుల జెఎసి నాయకులు, వేలాది మంది నిర్వాసితులు పాల్గొన్నారు.



ఆందోళన కార్యక్రమంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు దేముడునాయుడు



మాట్లాడుతున్న ఏరువాక శాస్త్రవేత్త భవాని

'పొలం బడి'పై శిక్షణ

ప్రజాశక్తి - కె.కోటపాడు : మండలంలోని ఎ.కోడూరు రైతు భరోసా కేంద్రంలో గురువారం వ్యవసాయ సహాయకులకు పొలంబడి పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఏరువాక శాస్త్రవేత్త భవాని మాట్లాడుతూ రైతు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలన్నారు. నారుమడిలో కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే ప్రధాన పంటలో చీడపీడలు పెద్దగా ఆశించకుండా మంచి దిగుబడులు వస్తాయని చెప్పారు. రెండో పంటగా మొక్కజొన్న వేసుకుంటే మంచి దిగుబడితోపాటు అధిక ఆదాయం వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు రవీంద్రనాథ్, శిక్షణ అధికారి చిరంజీవి, జిల్లా వనరుల కేంద్రం ఏవో తులసి, వ్యవసాయాధికారి సోమశేఖర్, ఏఈఓ లైలాదేవి పాల్గొన్నారు.

వికలాంగ పింఛన్ల తనిఖీ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాల్లో వికలాంగుల పింఛన్లను మూడు బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సువర్ణరాజు తెలిపారు. మండలంలో 1306 వికలాంగ పింఛన్లు ఉన్నాయని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సచివాలయాల వారీగా పింఛనుదారుల వివరాలను, సర్టిఫికెట్లను తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. తనిఖీల్లో వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు.

పిసిసి అధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు గురువారం విశాఖ వచ్చిన సందర్భంగా ఆయన్ను కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి పట్టణ అధ్యక్షులు బోయిన భానుమూర్తి యాదవ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రుద్రరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు నాయకులు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు సమిష్టిగా పని చేయాలన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేసిన వారికి సముచిత స్థానం కల్పించాలని ఈ సందర్భంగా భానుమూర్తి యాదవ్ పిసిసి అధ్యక్షుడిని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కాళ్ళ వెంకట సత్యనారాయణ, తుట్ట రమణ, పడాల కొండలరావు, ఆర్ఆర్ నాయుడు, బి.రాజు పాల్గొన్నారు.

జోనల్ కమిషనర్ దృష్టికి 84వ వార్డు సమస్యలు

ప్రజాశక్తి-అనకాపల్లి : జీవిఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మికి 84వ వార్డు సమస్యలను ఆ వార్డు కార్పొరేటర్ మాదంశెట్టి చిన్నతల్లి నీలబాబు గురువారం తెలియజేశారు. గురువారం జోనల్ కమిషనర్‌తో సమావేశమైన ఆమె వార్డులో రఘురాం కాలనీలో సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేయాలని, గొల్లవీధి సులాబ్ కాంప్లెక్సు, కొట్నివీధి ప్రధాన డ్రైనేజీలకు మరమ్మతులు చేయాలని, దోమల నివారణకు ఫాగింగ్ మిషన్ ఏర్పాటు చేయాలని, పూడుకుపోయిన సిల్టు తొలగించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జోనల్ కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సెక్షన్ ఇంజనీర్లు, డిఈలు, ఏఈ, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ అడ్మిన్ సిబ్బంది, టిడిపి నాయకులు సాలాపు మోహన్ పాల్గొన్నారు.

సిసి కెమెరాలు ఏర్పాటు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి ఆంజనేయ స్వామి గుడి వద్ద బుచ్చయ్యపేట ఎస్సై కుమారస్వామి ఆధ్వర్యంలో గురువారం నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా వీటిని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అసాంఘిక కార్యక్రమాల పట్ల, అనుమానాస్పద వాహనాల పట్ల అప్రమత్తంగా ఉండేందుకు సిసి కెమెరాలు ఉపయోగపడతాయని చెప్పారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - దేవరాపల్లి : మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం శుక్రవారం జరుగుతుందని ఇన్‌ఛార్జి ఎంపీడీవో జివి.రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి అధ్యక్షతన మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతుందని, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల మండల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

డిఇఒ లింగేశ్వరరెడ్డి పాఠశాలల సందర్శన



పాఠశాలను తనిఖీ చేస్తున్న డిఇఒ లింగేశ్వరరెడ్డి

ప్రజాశక్తి - చోడవరం

జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి గురువారం మండలంలోని జుత్తాడ, చోడవరం, లక్కవరంలోని ప్రాథమిక, జెడ్‌పి ఉన్నత పాఠశాలలను సందర్శించారు. జుత్తాడ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం అన్నం, సాంబారును రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. లక్కవరం ఉన్నత పాఠశాలలో నాడు నేడు పనులను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఎంఇఒ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహించే లీడ్ శిక్షణ కార్యక్రమానికి సబ్జెక్టు ఉపాధ్యాయులందరూ కచ్చితంగా హాజరు కావాలని ఆదేశించారు. నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని, పనులలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఖర్చుల వివరాలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఒ వెంకటేశ్వరరావు, ఎంఇఒ శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు సుందర్ సింగ్, సీతబాబు, అమ్మాజీ, లక్ష్మీ శారద, లక్ష్మి, సిఆర్‌పిలు కెవిఎమ్.నాయుడు, వరలక్ష్మి, సుబ్రమణ్యం, రవిశంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ సువర్ణరాజు

ఆన్‌లైన్ సేవల్లో డిజిటల్ అసిస్టెంట్లు కీలకం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు అవసరమైన ఆన్‌లైన్ సేవలను అందించడంలో డిజిటల్ అసిస్టెంట్లు కీలకంగా వ్యవహరించాలని ఎంపీడీవో సువర్ణ రాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండలంలోని 22 సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు 246 సర్వీసులు ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు. ప్రజలకు జవాబుదారిగా వుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఊడేరు సచివాలయంలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- అనకాపల్లి : రాష్ట్ర పరిశ్రమలు శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని ఊడేరు గ్రామ సచివాలయాన్ని ఎంపిపి గొర్లి సూరిబాబు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. అనంతరం దిబ్బపాలెం గ్రామంలో ఏర్పాటు చేస్తున్న ఆధార్ సెంటర్‌ను పరిశీలించారు. చిన్నపిల్లలు, 10 సంవత్సరాలు నిండిన వారంతా తప్పనిసరిగా ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఈఓపిఆర్‌డి ధర్మారావు, ఊడేరు సర్పంచు సిరిగిరిశెట్టి కృష్ణ మోహన్, దిబ్బపాలెం సర్పంచ్ పీలా ఉష అప్పారావు, సకల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పి కార్యాలయాన్ని సందర్శించిన ఆర్‌టిఐ కమిషనర్

ప్రజాశక్తి-అనకాపల్లి : సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్ యు.హరి ప్రసాద్ రెడ్డి గురువారం స్థానిక ఎస్పీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో పలు రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పౌరులు ప్రభుత్వం నుంచి సమాచారం కోరితే పారదర్శకతతో జాప్యం లేకుండా నిర్ణీత గడువులో అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి విజయభాస్కర్, పరిపాలన అధికారి శారద, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మేట్ ల్యాబ్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రొఫెషనల్ మేనేజ్మెంట్‌లో భాగంగా విద్యార్థులు మేట్ ల్యాబ్‌పై అవగాహన పెంచుకోవలసిన అవసరం ఉందని కార్పికాట్ ప్రాజెక్టు మేనేజర్ జె.ప్రేమ్ కుమార్ అన్నారు. స్థానిక డైట్ కళాశాలలో మూడు రోజుల పాటు ఇన్నోవేటివ్ అప్లికేషన్ డెవలప్మెంట్ యూజింగ్ మ్యాట్ ల్యాబ్ టూల్స్‌పై అవగాహన సదస్సు ముగింపు సమావేశంలో గురువారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ అవకాశాన్ని ప్రొఫెసర్లు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపల్ డాక్టర్ చల్లా నరసింహం, ఆసీఈ హెచ్ఓడి పూర్ణ ప్రియ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల భూములు దోపిడీకే భూ రక్షణ పథకం

ప్రజాశక్తి- అనకాపల్లి : రైతుల భూములను దోపిడీ చేసేందుకే వైసిపి ప్రభుత్వం భూ హక్కు, భూ రక్షణ పథకాన్ని తీసుకొచ్చిందని టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టాదార్ పాస్ పుస్తకాలపై ప్రభుత్వ రాజముద్ర ఉండాలి తప్ప ముఖ్యమంత్రి ఫొటో పెట్టుకోవడం ఆయన పిచ్చి పరాకాష్టకు నిదర్శనమన్నారు. ప్రశ్నించేవారి భూములను నిషేధిత జాబితా 22ఎలో చేర్చి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, అదే సందర్భంలో ప్రభుత్వ భూములను 22ఎ జాబితా నుంచి తొలగించి వాటిని లూటీ చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. విశాఖలో వైసిపి 42 నెలల పాలనలో రూ.40 వేల కోట్ల విలువైన భూములను వైసిపి దోపిడీదారులు కాజేశారన్నారు. రైతులు అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని ప్రభుత్వం చెబుతున్నా 19వేల ఫిర్యాదులు ఇప్పటికీ అపరిష్కృతంగా ఉన్నాయని తెలిపారు. సమావేశంలో టిడిపి నాయకులు ఉగ్గిన రమణమూర్తి, మళ్ల గణేష్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో పోలి పాడ్యమి పూజలు

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : కార్తీక మాసం చివరి రోజు గురువారం మండలంలోని పలు గ్రామాలలో గురువారం పోలి పాడ్యమి పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తోటాడలోని త్రిమూర్తులు ఆలయం, నాగులపల్లి రామలింగేశ్వర ఆలయం, శిరసపల్లి వీరభద్ర స్వామి ఆలయం, మూలపేట నటరాజ ఆలయం, వాడ్రాపల్లి దక్షిణేశ్వర స్వామి ఆలయం, మునగపాక కాశీ విశ్వేశ్వర, పాలేశ్వర భీమేశ్వర, సాంబమూర్తి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

మహాలక్ష్మి పూజలు ప్రారంభం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని దేవీపురంలో మార్గశిర మాస మహాలక్ష్మి పూజలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం మహాలక్ష్మి పూజలు నిర్వహించారు. డిసెంబర్ 1, 8, 15, 22 తేదీల్లో మహాలక్ష్మి పూజలు నిర్వహించబడతాయని నిర్వాహకులు ప్రభాకర్ తెలిపారు. ఈ పూజల్లో కుంకుమార్చన, మహాలక్ష్మి అష్టోత్తరం, మహాలక్ష్మి అష్టమకా అభిషేకం, మహాలక్ష్మి హోమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

కశింకోట : కశింకోట, బయ్యవరం గ్రామాల్లో మార్గశిర మాసోత్సవాలు ప్రారంభం సందర్భంగా కనక మహాలక్ష్మి అమ్మవారికి గురువారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : ఈనెల 26 నుండి మూడు రోజులపాటు రాజమండ్రిలో జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘ జాతీయ మహాసభ వాల్ పోస్టర్‌ను స్థానిక నందీశ్వర కళ ప్రాంగణం ఆవరణలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు పెంటకోట సత్యనారాయణ మాట్లాడుతూ 26న రాజమండ్రిలో జరిగే భారీ ప్రదర్శన, బహిరంగ సభకు కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోయిలాడ రాము, పెంటకోట జగప్పారావు, వి ల్లూరి జగ్గారావు పి శాని, శివ, కే రాముపాల్గొన్నారు.

అనకాపల్లి : భవన నిర్మాణ కార్మిక సంఘం జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటియుసి అనకాపల్లి జిల్లా కన్వీనర్ వైఎన్ భద్రం పిలుపునిచ్చారు. స్థానిక సర్వకామదాంబ పార్కు వద్ద మహాసభల గోడపత్రికను ఆవిష్కరించారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు శ్రీరామదాసు అబ్బులు, తాకాసి వెంకటేశ్వరరావు, ఎస్ సుబ్రహ్మణ్యం, మద్దాల రాము, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

కొత్తకోటలో రోడ్డు విస్తరణకు సహకరించాలి

ఆర్అండ్‌బి డివిజన్ డిఇఇ వేణుగోపాలరావు

ప్రజాశక్తి - కొత్తకోట:భవిష్యత్తు తరాలకు రహదారి విస్తరణ దోహద పడుతుందని, ఇందుకు స్థానిక నివాసదారులు సహకరించాలని నర్సీపట్నం ఆర్అండ్ బి డివిజన్ డిఈఈ వేణుగోపాలరావు సూచించారు. రావికమతం మండలం కొత్తకోట పంచాయతీ కార్యాలయంలో మండల తహసిల్దార్ మహేశ్వరరావు తో కలిసి కొత్తకోట గ్రామంలో రహదారి విస్తరణ పై గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఈఈ వేణుగోపాలరావు మాట్లాడుతూ, నర్సీపట్నం ఆర్అండ్‌బి పరిధి కొత్తకోటలో సుమారు 100 అడుగుల మేర రహదారి విస్తరణకు న్యూ డెవలప్ మెంట్ బ్యాంకు ద్వారా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు. ప్రస్తుతం ఉన్న రహదారితో పాటు మరి కొంత మేర సర్వే చేసి విస్తరణ చేయాల్సి ఉందన్నారు. మార్కింగ్ అనంతరం సొంత యజమానులు తనంతట తామే తొలగించుకుంటే నష్టం తగ్గుతుందని పేర్కొన్నారు. రహదారి విస్తరణతో గ్రామ స్వరూపం మారుతుందని, అభివృద్ధికి నాంది పలుకుతుందని ఆయన స్పష్టం చేశారు. సమగ్ర సర్వే అనంతరం విస్తరణ పనులు చేపడతామన్నారు. తహసిల్దార్ మహేశ్వరరావు మాట్లాడుతూ, గ్రామ పెద్దలు, స్థానికులు ఏకమై రహదారి విస్తరణకు సహకరించాలని కోరారు. మార్కింగ్ అనంతరం నోటీసులు జారీ చేస్తామని, తగు కాలంలో తొలగించాల్సి ఉందన్నారు. విస్తరణ సమయంలో ఎటువంటి తగాదాలు చోటు చేసుకోకుండా 144 సెక్షన్ విధిస్తామని తహసిల్దార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోన లోవ రాజు, ఉప సర్పంచ్ పందల దేవా, కొత్తకోట ఎస్సై విభూషణరావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి ఆదిమూర్తి పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఇఇ వేణుగోపాలరావు



భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ ,సర్పంచ్

సంపద కేంద్రాలతో ఆదాయం

ప్రజాశక్తి -నక్కపల్లి :చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు మరింత ఆదాయం సమకూర్చుకోవాలని ఈవోపిఆర్‌డి వెంకటనారాయణ అన్నారు. మండలంలోని దేవవరం లో గురువారం పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సచివాలయ సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందే విధంగా సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. సచివాలయాల్లో అందిస్తున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా సేకరించి సంపద సృష్టించు కోవాలన్నారు. రైతు భరోసా భవన నిర్మాణ పనులను పరిశీలించి, త్వరత గతిన పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొర్ల రాఘవ కుమారి, వైసిపి నాయకులు నరసింహమూర్తి, కార్యదర్శి సాయి లక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు కేటాయించాలి

ప్రజాశక్తి-మాడుగుల:విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సకాలంలో కేటాయించాలని కేజే పురం ఎంపీటీసీ బీసెట్టి శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మాడుగుల నుండి అనకాపల్లి వరకు వివిధ కళాశాలలకు వెళుతున్న విద్యార్థులకు కళాశాల సమయానికి ఒకే బస్సు ఉండటంతో ఇతర ప్రయాణికుల రద్దీ కారణంగా బస్సు డోరు వద్ద విద్యార్థులు వేలాడుతూ ప్రయాణిస్తున్నారన్నారు. విద్యార్థినులు సైతం బస్సుకు వేలాడుతూ ప్రయాణించవలసి వస్తుందని అన్నారు. ఇటీవల కేజే పురం జంక్షన్ వద్ద ఒక విద్యార్థిని బస్సులో వేలాడుతూ కిందకు పడిపోయిందన్నారు. విద్యార్థులు కళాశాలకు చేరు కునేందుకు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని, తక్షణం ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి అవసరం మేరకు అదనపు సర్వీసులు కల్పించాలని కోరారు.



వైఎస్ఆర్ బీమా నగదు అందజేత

ప్రజాశక్తి- చీడికాడ:అనారోగ్యంతో మరణించిన బాధిత కుటుంబానికి పది వేల నగదు అందజేశారు. మండలంలోని ఖండివరం గ్రామంలో ఓ వ్యక్తి మృతి చెందటంతో గురువారం ఆ కుటుంబానికి దహన సంస్కారాల నిమిత్తం తక్షణ సహాయం కింద 10 వేలు కుటుంబ సభ్యులకు గ్రామ సర్పంచ్ శ్రీరమ్ రెడ్డి లక్ష్మి, వైసిపి జిల్లా సీనియర్ నాయకులు సుంకర శ్రీనువాసరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కో- ఆప్షన్ సభ్యులు షేక్ సూర్య నారాయణ, పిఎసిఎస్ అధ్యక్షులు మోసురు సన్నిబాబు, ఎంపీటీసీ గెంజి స్వాతి బాలాజీ, పంచాయతీ కార్యదర్శి మచ్చ వీర్రాజు పాల్గొన్నారు.

నర్సీపట్నం రూరల్:మున్సిపాలిటీ 16వ వార్డులో మృతి చెందిన అనుపోజు రమణ కుటుంబానికి గురువారం వార్డు కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి (చిన్ని), సెక్రటరీ గోవిందలు వైయస్సార్ బీమా తక్షణ సాయం రూ.10వేలను అందజేశారు. రమణ కుటుంబానికి వైయస్సార్ బీమా కింద కుటుంబానికి లక్ష రూపాయలు మంజూరయ్యాయి. ముందస్తుగా రూ.10వేలు అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, వార్డు ప్రముఖులు, సచివాలయ సి బ్బంది, వాలంటీర్స్ పాల్గొన్నారు.



చీడికాడలో నగదు ఇస్తున్న సర్పంచ్

అనారోగ్యంతో విఆర్ఎ మృతి

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో తట్లబంద పంచాయతీలో పని చేస్తున్న వీఆర్ఏ కూరాకుల నూకరాజు (65) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. దహన సంస్కారాలు నిమిత్తం ఆయన కుటుంబానికి సర్పంచ్ గోకివాడ రమణ, చోడవరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజాన నర్సింహులు చేతుల మీదుగా పదివేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోకివాడ రమణ మాట్లాడుతూ, నూకరాజు గ్రామ పంచాయతీకి అనేక సేవలందించారన్నారు.

రోడ్లను బాగు చేయాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోడ్లను బాగు చేసి ప్రయాణికుల ప్రాణాలను కాపా డాలని రాష్ట్ర రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు డిమాండ్ చేశారు. గురువారం నర్సీపట్నం మండలం చెట్టుపల్లి గ్రామంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రోడ్లు అధ్వానంగా ఉండటంతో ప్రయాణికుల ప్రాణాలు పోతూనే ఉన్నా ప్రభుత్వాలకు చీమకుట్టినట్టు కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు బాగు చేసి ప్రజలు, ప్రయాణికుల ప్రాణాలను కాపాడే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేదా అని ప్రశ్నించారు.ఇప్పటికైనా ప్రయాణికుల ప్రాణాలను దృష్టిలో పెట్టుకొని రోడ్లను బాగు వేయాలని డిమాండ్ చేశారు.



పశువుల దాణా పంపిణీ

ప్రజాశక్తి -రావికమతం:మండలంలో కవగుంట గ్రామ పంచాయతీ బుడ్డిబంద గ్రామంలో గురువారం గ్రామ సర్పంచ్ దాసరి సూర్యకుమార్ వరహాలు, కొమిర ఎంపిటిసి బంటు శ్రీనివాసరావు చేతుల మీదుగా రైతులకు పశువుల దాణాను అందజేశారు. సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, రైతులందరూ నాణ్యమైన టిఎంఆర్ సంపూర్ణ మిశ్రమ దాణాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దాణాను వాడటంతో పశువుల పాల ఉత్పత్తి పెరుగుదలతో పాటు అధిక ఆదాయం పొందే అవకాశం ఉంటుందన్నారు. పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పుష్ప మాట్లాడుతూ, 60శాతం రాయితీతో రైతులకు టిఎంఆర్ సంపూర్ణ మిశ్రమ దాణాను రైతులకు అందించడం జరుగుతుందని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి జగన్ మోహన్‌రావు, వెటర్నరీ అసిస్టెంట్ నాని పాల్గొన్నారు.



దాణాను పంపిణీ చేస్తున్న సర్పంచ్

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇటీవల నూతనంగా మంజూరైన ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ కోర్సులో బోధించుటకు అధ్యాపకుల నుండి దరఖాస్తు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్‌సి కెమిస్ట్రీలో 55శాతం ఉత్తీర్ణత కలిగి ఎస్ఇటి, ఎస్-ఎల్ఇటి, పిహెచ్డీలో ఉత్తీర్ణులైన అభ్యర్థుల నుండి ఈనెల 29 లోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు. 30వ తేదీన ఇంటర్వ్యూలకు హాజరు కావాలని, మరిన్ని వివరాలకు ఫోన్: 8790365982 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

ఆక్రమణలపై విచారణ

ప్రజాశక్తి-మాకవరపాలెం: మండలంలోని జి.కోడూరు గ్రామం లో సాగునీటి కాలువలపై అక్రమ నిర్మాణాలు చేపట్టడంపై అదే గ్రామానికి చెందిన జమరామం స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు స్పందన ఫిర్యాదుపై విచారణ చేశారు. సాగు నీటి కాలువ పై నిర్మాణాలు తొలగించాలని, లేని పక్షంలో వాటిని తీసివేస్తామని అక్రమ దారులకు తెలిపారు.

కబడ్డీ పోటీల్లో నర్సీపట్నం టీమ్ సత్తా

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్:జిల్లా స్థాయి జగనన్న క్రీడా సంబరాలలో భాగంగా నిర్వహించిన కబడ్డీ పోటీల్లో నర్సీపట్నం నియోజకవర్గం టీమ్ ప్రథమ స్థానం సాధించింది. గురువారం ఈ పోటీలు అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో జరిగాయి. ఏడు నియోజకవర్గాల నుండి క్రీడాకారులు పాల్గొన్నారు. నర్సీపట్నం నియోజకవర్గం నుండి కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీల కు వెళ్లగా కబడ్డీ పోటీల్లో బాలికలు ఫైనల్స్లో పాయకారావుపేట టీమును ఓడించి ప్రథమ స్థానం సాధించింది. క్రీడాకారులను జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ సూర్యారావు, శాప్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, శాప్ కోచ్ అబ్బు అభినందించారు.



సత్తా చాటిన విద్యార్థులతో స్పోర్ట్స్ అధికారి, డైరెక్టర్

రోగులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-పాయకరావుపేట:మండలంలోని యస్. నర్సాపురం సచివాలయం వద్ద ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ క్లినిక్‌ను గ్రామ సర్పంచ్ మంచాల అనిత ప్రారంభించారు. మెడికల్ ఆఫీసర్ పి.కావ్య, 104 మెడికల్ ఆఫీసర్ బత్తుల రత్న శేఖర్ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. గర్భిణీలు, బాలింతలకు రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మంచాన పడ్డ దీర్ఘ కాలిక వ్యాధిగ్రస్తుల ఇంటికి వెళ్లి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అర్.జె.బాలాజీ సింగ్, హెల్త్ సూపర్వైజర్ డి.సూర్యనారాయణ పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: దక్షిణ భారతి హిందీ ప్రచార సభ నిర్వహించిన ప్రావీణ్య పరీక్షలో మొదటి స్థాయి పరీక్షకు వినయ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నుండి 33 పంది హాజరు కాగా అందులో 23 మందికి 90 మార్కులు, మిగిలిన వారు 80 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా వినయ్ విద్యాసంస్థ కరస్పాండెంట్ బత్తుల వాసు శివ నాగలక్ష్మి,ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. రెండో స్థాయి పరీక్షలో ఇంతకన్నా ఎక్కువ ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు



పళ్లు, రొట్టెలు ఇస్తున్న కుటుంబ సభ్యులు

ఘనంగా విజయ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:మాజీ మంత్రి, తెలుగుదేశం నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు తనయుడు, పార్టీ ప్రధాన కార్యదర్శి విజయ్ పుట్టినరోజు నర్సీపట్నంలో యువత ఘనంగా జరిపారు. పుట్టినరోజు సందర్భంగా ఎటువంటి కేకులు బహుమతులు పూలగుచ్చాలు ఇవ్వద్దని విజయ్ పిలుపునివ్వగా కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో పుట్టినరోజున సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు రెండో తనయుడు రాజేష్, సతీమణి దివ్య స్థానిక 13వ వార్డులో బాలల సదన్‌లో 50 మంది విద్యార్థులకు బట్టలు, పళ్ళు రొట్టెలు పంపిణీ చేశారు.

హైర్ బస్ డ్రైవర్లకు కనీస వేతనాలు అమలుచేయాలి

సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఆర్‌టిసిలో పనిచేస్తున్న హైర్ బస్ డ్రైవర్లకు కనీసవేతనం రూ.26 వేలు అమలు చేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా హైర్‌బస్ డ్రైవర్ల జనరల్‌బాడీ సమావేశం గురువారం పిఠాపురం కాలనీలోని సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ, కరోనా సమయంలో పూర్తిగా ఆదాయాలు లేక కుటుంబాలు రోడ్డున పడినా ఆర్‌టిసి యాజమాన్యం, కాంట్రాక్టర్లు ఆదుకోలేదన్నారు. గత మూడేళ్ల నుంచి కార్మికులకు జీతాలు పెంచకుండా, ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో హైర్ బస్ యాజమానులు, డ్రైవర్ల యూనియన్‌కు మధ్య 2019 నవంబర్ 1న వేతన, ఇతర సమస్యలు పరిష్కారం కోసం ఒప్పందం జరిగిందని, ఆ ఒప్పందం నేటికీ అమలుకాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. బస్సుకు ఇద్దరు డ్రైవర్లను నియిమించాలని, పిఎఫ్, ఇఎస్ఐ, ప్రమాదబీమా అమలు చేయాలని, బోనస్, శెలవులు, ఐడికార్డులు, బస్‌పాసులు ఇవ్వాలని, ప్రమాదాలు జరిగితే బస్సు యజమానే బాధ్యత వహించాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ జిఒ విషయాలు కార్మికులకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బస్సు యాజమాన్యాలకు, ఆర్‌టిసి మేనేజ్‌మెంట్‌కు సమస్యలపై వినతిపత్రాలు అందజేయాలని, వాటిని 15రోజుల్లో పరిష్కారం చేయకపోతే సమ్మెకు సిద్ధం కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సిహెచ్.కృష్ణకుమార్, అధ్యక్షులు కెజె.అప్పారావు, గౌరవాధ్యక్షులు వి.తులసీరాం తదితరులు మాట్లాడారు.

స్టీల్ ప్లాంట్‌ను కారు చౌకగా అదానికి అమ్మేస్తారా?

ప్రజాశక్తి -కలెక్టరేట్, విశాఖ : ప్రభుత్వ రంగంలో లాభాల బాటలో నడుస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అదానీ వంటి కార్పొరేట్ సంస్థకు అమ్మివేయడమే బిజెపి పనిగా పెట్టుకుందని ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ఈశ్వరరావు విమర్శించారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు గురువారం నాటికి 602వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐఎన్‌టియుసికి చెందిన హెచ్‌పి సిఎల్ కాంట్రాక్ట్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రూ. లక్షల కోట్ల విలువైన స్టీల్ ప్లాంట్ ఆస్తులను కేవలం రూ.50 వేల కోట్లకు అదానికి అమ్మివేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చూడటం దుర్మార్గం అన్నారు. ఎన్నో పోరాటాలు, త్యాగాలతో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే అధికారం మోడీ ప్రభుత్వానికి లేదన్నారు. ఈ దీక్షలలో కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.నర్సింగరావు, కోశాధికారి ఎస్.తాతబాబు, అగస్టియన్, ఎయు రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

'కనకమహాలక్ష్మి' మార్గశిర మాసోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : బురుజుపేటలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్రస్వామి పాల్గొని విశేష పూజలు, పంచామృత అభిషేకం, సహస్ర నామార్చన పూజలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వైజాగ్ జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అమ్మవారి ట్రస్ట్ బోర్డు చైర్ పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన గురువారం రోజునే మార్గశిర మాసోత్సవాలు ప్రారంభం కావడం విశేషం కాగా, భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. దేవస్థానం ఈవో కె.శాంతి మాట్లాడుతూ, ఈ నెలరోజుల పాటు భక్తులకు ప్రతిరోజూ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సాంసకృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు.



మార్గశిర మాసోత్సవాల్లో పాల్గొన్న శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

పబ్లిక్ హియరింగ్‌లో ప్రజల గళం వినిపించాలి

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని కొవ్వూరు పంచాయతీ ఎదురువలస రెవెన్యూ పరిధిలో నల్లరాయి క్వారీని సిపిఎం ప్రతినిధి బృందం గురువారం సందర్శించింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు, మండల కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ, కొవ్వూరులో మూడు క్వారీల పర్యావరణ అనుమతుల కోసం ఒక్కో రోజు ప్రజల అభిప్రాయాలు చెప్పడం అన్యాయమన్నారు. నేటికీ క్వారీ అనుమతులు తీసుకొని 12 సంవత్సరాలైనా క్వారీ నిబంధన ప్రకారం క్వారీ ప్రదేశంలో రాయి గోడ నిర్మించలేదన్నారు. నల్లరాయిను భారీ వాహనాల ద్వారా 45 టన్నులు నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై వెళ్లడంతో దుమ్ము ధూళి రావడంతో ప్రజలకు శ్వాసకోస వ్యాధులు బారిన పడుతున్నారన్నారు. నేటికీ కూడా క్వారీ అభివృద్ధి నిధుల నుండి గ్రామాలకు మంచినీరు, మెడికల్ క్యాంపు వంటి సౌకర్యాలు కల్పించ లేదన్నారు. పర్యావరణ శాఖ అధికారులు, మైన్స్ డిపార్టుమెంట్ అధికారులు నల్లరాయి క్వారీ యాజమాన్యంతో కుమ్మక్కవడంతో నిబంధనలు పట్టించుకో లేదన్నారు. ఈనెల 25న జరిగే పబ్లిక్ హియరింగ్‌లో ప్రజల తన అభిప్రాయాలు చెప్పాలని కోరారు.



క్వారీని పరిశీలిస్తున్న సిపిఎం నేత గోవిందరావు

ఘనంగా మరిణి తల్లి పండుగ

ప్రజాశక్తి - మాకవరపాలెం:జి.కోడూరు గ్రామంలో మరిణి తల్లి పండుగను ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి మరిణి తల్లి గుడి వద్ద పెద్ద సంఖ్యలో మహిళ భక్తులు బారులు తీరారు. అనంతరం కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామంలో పలు సాంఘిక నాటకాలు. గ్రామం అంతా లైటింగ్లతో నిర్వహించారు. భక్తుల అధికంగా రావడంతో సందడి నెలకొంది.



బారులు తీరిన భక్తులు

బుల్లయ్య కాలేజీలో బిపిఎం శిక్షణ

ప్రజాశక్తి- సీతమ్మధార : బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ (బిపిఎం) శిక్షణకు దేశంలో నాస్కం ఎంపిక చేసిన పది కళాశాలలో ఎపి నుంచి బుల్లయ్య కళాశాల ఒక్కటే ఉండడం సంతోషంగా ఉందని కళాశాల కరస్పాండెంట్ జి మధుకుమార్ అన్నారు. గురువాదరం నాస్కం, కాన్నిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలలో నిర్వహించిన బిపిఎంశిక్షణ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతూ విద్యార్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా రాణించాలన్నారు. నాస్కం డిప్యూటీ డైరెక్టర్ సతీష్ కుమార్ దాంట్ల మాట్లాడుతూ డబ్ల్యూఎన్‌ఎస్, ఇన్ఫోసిస్, ఈ ఎక్సెల్, ఫస్ట్ స్టోర్స్ వంటి ప్రముఖ ఐటి కంపెనీలకు అవసరమైన నైపుణ్యం కలిగిన అభ్యర్థులను ఎనిమిది వారాల శిక్షణ ద్వారా తయారుచేసి అందిస్తామన్నారు. 2000లో ఇదే కాలేజీల బీకాం చదివిన తాను, ఇపుడు ఈ కాలేజీ విద్యార్థులకు ఉద్యోగావకాశాలను కల్పించేందుకు బిపిఎం శిక్షణకు రావడం అనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కాన్నిక్స్ ఆపరేషన్ డైరెక్టర్ సంపత్ నంది, కస్టమర్ సక్సెస్ మేనేజర్ ఎ. సతీష్ పాల్గొన్నారు.

నిరంతర పర్యవేక్షణతో బాలల హక్కుల పరిరక్షణ

ప్రజాశక్తి-సిరిపురం:నిరంతర పర్యవేక్షణతో బాలల హక్కుల పరిరక్షణకు చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం అన్నారు. సిరిపురంలోని ప్రభుత్వ అతిథి గహంలో విలేకర్లతో మాట్లాడుతూ, తల్లిదండ్రులు, బంధువులు, పాఠశాలలు, ఇలా వివిధచోట్ల బాలలపై శారీరక, లైంగిక దండనలు, ఒత్తిళ్లకు సంబంధించి ఫిర్యాదులు కోకొల్లలుగా వస్తున్నాయని, వీటిపై తగు చర్యలు అన్ని జిల్లాల ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. బాలల హక్కులకు నిర్దేశించిన చట్టాలు పటిష్ట అమలుకు కమిషన్ పర్యవేక్షిస్తుందన్నారు. దీనికి సంబంధించి ఏవైనా ఫిర్యాదులుంటే apscpcr2018@gmail.com మెయిల్‌కు పంపాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రొహిబిషన్ అధికారి శరత్‌కుమార్, బాలల సంరక్షణ విభాగం జిల్లా అధికారి అల్లు సత్యనారాయణ పాల్గొన్నారు.

రేపు '8కె రన్ ఫర్ అంబేద్కర్'

ప్రజాశక్తి- సీతమ్మధార : ఈనెల 26న ఉదయం 6 గంటలకు వైజాగ్ బీచ్‌రోడ్‌లో కాళీమాత గుడి నుంచి '8కె రన్ ఫర్ అంబేద్కర్' నిర్వహిస్తున్నట్లు భీమసేన వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ రవి సిద్ధార్థ తెలిపారు.రామ టాకీస్ దరి అంబేద్కర్ భవనంలో విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా భీమసేన వైజాగ్ ఆధ్వర్యంలో గడచిన ఏడేళ్లుగా విశాఖ బీచ్‌రోడ్డులో రన్ ఫర్ అంబేద్కర్ నిర్వహిస్తున్నామన్నారు.కార్యక్రమంలో ఐఎఎస్ అధికారి విజయ్‌కుమార్, జివిఎంసి కమిషనర్ రాజబాబు, డిఎస్‌పి కాళిదాసు పాల్గొంటారని తెలిపారు. అధికసంఖ్యలో భీమ్‌సేన్ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో భీమసేన నాయకులు మోహన్, ఓంకార్ వెంకటేశ్వరరావు, కుమారు, ప్రసాదు, శివకుమార్, శ్రీకాంత్, రామరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-కోటవురట్ల:ఇటీవల నిర్వహించిన 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం పొందిన విద్యార్థులను జల్లూరు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసమూర్తి, సిబ్బంది గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు నిరంతరం సామాజిక వర్తమాన భవిష్యత్తు అంశాల పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. బహుమతులు పొందిన విద్యార్థుల్లో లాలం ఇందు, గుడివాడ వినయ్, శివకుమార్, నాగజ్యోతి ఉన్నారు. వీరికి స్కూలు తరపున షీల్డ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సుకుమార్, శ్రీనివాస్, అప్పలరాజు, ప్రసన్న పాల్గొన్నారు.



అభినందిస్తున్న హెచ్‌ఎం, సిబ్బంది



మాట్లాడతున్న ఎంపిడిఒ చంద్రశేఖర్

డిజిటల్ సర్వీస్‌పై అవగాహన

ప్రజాశక్తి-కోటవురట్ల:సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు డిజిటల్ సర్వీసెస్ పట్ల అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో చంద్రశేఖర్ సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన డిజిటల్ సర్వీసెస్ పట్ల డిజిటల్ అసిస్టెంట్లకు నిర్వహించిన శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా ఏపీ సేవా సర్వీసెస్‌లో ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డు, మ్యుటిషన్ సహా ఆధార్ అప్డేట్ వంటి అంశాల పట్ల సిబ్బందికి అవగాహన కల్పించారు. అందు బాటులో ఉంటూ మెరుగైన సేవలు అందిం చాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యద ర్శులు, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న రామకృష్ణ

డిగ్రీ కళాశాలలో సదస్సు

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్ క్లూషన్ సెంటర్, కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అమెరికా వాషింగ్టన్ న్యూరో సైన్స్ స్పెషలిస్ట్ డాక్టర్ ఎం. రామకృష్ణ బయోసైన్స్, కంప్యూటర్స్ రంగంలో ఉన్నత ఉద్యోగ అవకాశాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు కళాశాలలో జరుగుతున్న అభివృద్ధిని, ఉద్యోగ అవకాశాలను, జెకెసి, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లో జరుపుతున్న కృషిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ పిన్సిపాల్ ఎన్‌ఎస్ కృష్ణ పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఎంపిడిఒ

సదరం సర్టిఫికెట్లు పరిశీలన

ప్రజాశక్తి-చీడికాడ: కోనాం సచివాలయం పరిధిలో వికలాంగుల పించనుదారుల సదరం ధ్రువపత్రాలను గురువారం ఎంపీడీవో జయప్రకాష్ పరిశీలించారు. ఎంపీడీవో జయప్రకాష్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఆదేశాల మేరకు వికలాంగ పింఛన్లు పొందుతున్న వారి వైకల్యాలను, సదరం సర్టిఫికెట్లను పరిశీలించా మన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సన్యాసిరావు, వైస్ ఎంపీపీ కిమిడి చిన్నమ్మలు పాల్గొన్నారు.

పాఠశాల పున:ప్రారంభానికి చర్యలు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని సిహెచ్ నాగా పురం పంచాయతీ కుమారపురంలో 2015 సంవత్సరం లో మూతపడిన పాఠశాలను పున:ప్రారంభించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. అప్పట్లో విద్యార్థుల సంఖ్య చాలా తక్కువ ఉండటంతో ఈ పాఠశాలను సిహెచ్.నాగాపురంలో స్కూల్లో విలీనం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధుల వినతి, ఎమ్మెల్యే, ఎంపిల చొరవతో పాఠశాలను పున:ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. సర్పంచ్ యలమంచిలి రఘు రామచంద్రరావు పాఠశాల ఆవరణలో తుప్పలు తొలగించి చదును చేయించారు.